
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
శనివారం 6 డిసెంబరు 2025



తగ్గేదే లే

పల్లెపోరు రోజురోజుకూ వేడెక్కుతోంది. నామినేషన్ల ఘట్టం ముగిసి.. ప్రచారపర్వంలోకి దిగుతున్న వేళ మరింత రాజుకుంటోంది. అభ్యర్థులంతా విజయమే లక్ష్యంగా పావులు కదుపుతుంటే.. ఉమ్మడి జిల్లాలోని పలు గ్రామాల్లో రక్త సంబంధీకుల మధ్య పోరు తారాస్థాయికి చేరుతోంది. బంధుత్వాలను పక్కన పెట్టి మరీ పలువురు అభ్యర్థులు ఎవరి సత్తా వారు చాటేలా సర్వశక్తులు ఒడ్డుతున్నారు. తల్లీకూతురు.. అన్నాతమ్ముడు.. అక్కాచెల్లి.. ఇలా పలువురు.. పలు పంచాయతీల్లో పోటీ చేసి గ్రామ రాజకీయాల్లో ఉత్కంఠ రేపుతున్నారు.

- ఢీ అంటే ఢీ అంటున్న రక్తసంబంధీకులు
- బంధుత్వాల మధ్య 'పంచాయతీ వార్'
- పలు గ్రామాల బరిలో తల్లీకూతుళ్లు.. అన్నా తమ్ముళ్లు.. అక్కాచెల్లెళ్లు
- ఉమ్మడిజిల్లాలో రసవత్తరంగా మారుతున్న పల్లెపోరు

ఖమ్మం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతిప్రతినిధి) : గ్రామపంచాయతీ ఎన్నికల వేళ పలు గ్రామాల్లో రాజకీయం రసవత్తరంగా మారుతోంది. ఢీ అంటే ఢీ అన్నట్టుగా రక్తసంబంధీకులు పోటీకి సై అనడం మరింత ఉత్కంఠను రేపుతోంది. సర్పంచ్, వార్డు పదవులకు తగ్గేదేలే.. అన్నట్టుగా బంధువుల మధ్య పోటీ సాగుతోంది. దీంతో ఎన్నికల సమయానికి గ్రామాల్లో అనేక కుటుంబాల్లో బంధుత్వాల మధ్య చిచ్చురేగే పరిస్థితి కనిపిస్తోంది. బంధుత్వాల కంటే పార్టీలు, తమ వ్యక్తిగత సిద్ధాంతాలు ముఖ్యమని కొందరంటుంటే.. మరికొందరు తమకు ఇది సవాల్ అని పేర్కొంటున్నారు. ఇప్పటికే కొన్ని చోట్ల ఎన్నికలు ఏకగ్రీవం కాగా.. మరికొన్ని చోట్ల అన్నాతమ్ముళ్లు, తల్లీకూతుళ్లు, అక్కాచెల్లెళ్లతో పాటు దగ్గరి బంధువుల మధ్య వార్ నడుస్తోంది. బంధువుల మధ్య ఎన్నికల పోటీ వద్దు ఎవరో ఒకరు ఉపసంహరించుకోండి అంటూ పోటీ దారుల దగ్గరి బంధువులు, ఇంటిపెద్దలు వారించినా పార్టీ నిర్ణయం మేరకు పోటీలో ఉంటామని, గెలుపే తమకు ముఖ్యమంటూ ఉపసంహరణకూ నో అంటూ కాలుదువ్వుతున్నారు.

రక్తసంబంధీకులు పోటీ చేస్తున్న వాటిలో కొన్ని..

మేజర్ పంచాయతీ అయిన పెనుబల్లిలో తల్లీకూతుళ్ల మధ్య వార్ జరుగుతోంది. కాంగ్రెస్ నుంచి భూక్యా స్వామ్రాజ్యం, బీఆర్ఎస్ నుంచి కూతురు బానోతు పాప ఇద్దరు నామినేషన్లు వేసి బరిలో ఉన్నారు. ఈ గ్రామం ఎస్టీ మహిళకు రిజర్వ్ అయ్యింది.

వైరా మండలంలోని ముసలిమడుగు పంచాయతీలో అన్నదమ్ముల మధ్య పోటీ నడుస్తోంది. తడికమళ్ల నాగేశ్వరరావు కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో ఉండగా కాంగ్రెస్ రెబల్ అభ్యర్థిగా తడికమళ్ల నాగార్జున పోటీలో ఉన్నారు. అన్నాదమ్ముల మధ్య పోటీ ఇక్కడ నడుస్తోంది. ముదిగొండ మండలం వెంకటాపురంలో సీపీఎం అభ్యర్థిగా 91ఏళ్ల వయసులో రాయల వెంకటేశ్వర్లు పోటీ చేస్తున్నారు. ఈయన సీపీఎం సీనియర్ నేత. గ్రామంలో 30 ఏళ్ల పాటు ఉపసర్పంచ్‌గా పనిచేశారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్, కాంగ్రెస్ నేత రాయల నాగేశ్వరరావుకు తండ్రి. కుమారుడు నాగేశ్వరరావు పోటీ చేయొద్దని వారించినా ఆయన మాత్రం ఎవరిపార్టీ వారిదే ఎవరి సిద్ధాంతం వారిదే అంటూ కాంగ్రెస్ అభ్యర్థిపైనే పోటీకి దిగారు.

కూసుమంచి పంచాయతీ ఎన్నికల్లో రెండు వార్డులో భార్యాభర్తలు రెండు వార్డుల్లో వేర్వేరుగా పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ మద్దతుతో 12వ వార్డులో అర్వపల్లి ఉపేందర్ పోటీ చేస్తుండగా, నాలుగో వార్డులో ఆయన భార్య అర్వపల్లి రేణుక నామినేషన్ వేసి అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

బోనకల్ పంచాయతీలో మూడో వార్డులో బాబాయి ఆంతోటి శ్రీను బరిలో ఉండగా కుమారుడు ఆంతోటి శాంతికృష్ణ పోటీ చేస్తున్నాడు. ఇదే మండలంలో బీరవల్లి గ్రామంలో కాంగ్రెస్ తరఫున వరసకు అత్తా కోడళ్లు ఇద్దరు సర్పంచ్ పదవికి పోటీలో ఉన్నారు. అత్త చంద్ర సరిత పోటీలో ఉండగా.. వరసకు కోడలు అయిన చంద్ర శ్రీలక్ష్మీ కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీలో ఉన్నారు.

● నేలకొండపల్లి మండలం కొంగర పంచాయతీలో కాంగ్రెస్ నుంచి చిట్టూరి రంగమ్మ, బీఆర్ఎస్ తదితర పార్టీల మద్దతుతో కాంగ్రెస్ రెబల్ అభ్యర్థిగా మన్నెంపూడి కృష్ణకుమారి పోటీ చేస్తున్నారు. వీరిద్దరు సొంత అక్కాచెల్లెల్లు, తోడళ్లల్ల మధ్య రాజకీయ విభేదాలతో వీరిద్దరు పోటీ చేశారు. అక్క కృష్ణకుమారికి పార్టీ మద్దతు ఇవ్వక పోవటంతో చెల్లెలు చిట్టూరి రంగమ్మపై బరిలోకి దిగారు. ఇదే మండలం అప్పలనర్సింహాపురం పంచాయతీలో వరుసకు పిన్ని బిడ్డలైన బండారు సుభాషిణి, టీడీపీ నుంచి మన్నె రాజశ్రీ కాంగ్రెస్ నుంచి పోటీలో ఉన్నారు.

భద్రాద్రి జిల్లాలో పలువురు..

భద్రాచలం గ్రామపంచాయతీలో సర్పంచ్ అభ్యర్థిగా బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థిగా మానెరామకృష్ణ పోటీ చేస్తుండగా.. ఆయన కుమార్తె మానె లావణ్య 11వ వార్డు నుంచి బరిలో ఉన్నారు. 7వ వార్డులో నర్రా రాము బరిలో ఉండగా ఆయన అన్న భార్య నర్రా వాణి 8వ వార్డులో (మిగతా 6వ పేజీలో)

జీపీఎస్ మార్చి.. అధికారులను ఏమార్చి

- లారీకి బదులుగా ద్విచక్రవాహనానికి జీపీఎస్
- ఎంఎల్ఎస్ పాయింట్‌కు రాకుండానే మిల్లర్‌కు మళ్లించేలా ప్రణాళిక
- 300 క్వింటాళ్ల రేషన్ బియ్యం అక్రమాన్ని గుర్తించిన విజిలెన్స్ అధికారులు
- 15 మందిపై కేసు నమోదు.. వివరాలు వెల్లడించిన భద్రాద్రి అదనపు కలెక్టర్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

కొత్తగూడెం కలెక్టరేట్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా రేషన్ బియ్యానికి సంబంధించి ప్రభుత్వం బియ్యాన్ని సేకరించి గోదాముల్లో నిల్వ ఉంచుతుంది. అనంతరం ఎంఎల్ఎస్ పాయింట్ అక్కడి నుంచి రేషన్ దుకాణాలకు తరలించి.. ఆ తర్వాత లబ్ధిదారులకు అందించాల్సి ఉంటుంది. అయితే కొత్తగూడెం జిల్లాలో మాత్రం అసలు ఎంఎల్ఎస్ పాయింట్‌కు రాకుండానే వచ్చినట్టుగా లెక్కలు చూపించారు సిబ్బంది. అదీ ఎక్కడా దొరకకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. పీడీఎస్ బియ్యాన్ని తరలించే సమయంలో అవి పక్కదారి పట్టకుండా ఉండేందుకుగాను లారీలకు జీపీఎస్ ఏర్పాటు చేస్తారు. కానీ అక్రమార్కులు మాత్రం లారీకి అమర్చాల్సిన జీపీఎస్‌ను ద్విచక్రవాహనంపై ఎంఎల్ఎస్ పాయింట్‌కు తీసుకొచ్చి.. బియ్యాన్ని దిగుమతి చేసినట్టుగా రికార్డులు చూపించారు. అయితే సివిల్‌సప్లయీస్ రాష్ట్ర విజిలెన్స్ అండ్ టాస్క్‌ఫోర్స్ అధికారులకు అందిన సమాచారంతో నిఘా ఏర్పాటు చేయడంతో బండారం బట్టబయలవగా.. ఎంఎల్ఎస్ పాయింట్ సిబ్బంది సహా 15 మందిపై కేసు నమోదు చేశారు. దానికి సంబంధించిన వివరాలను శుక్రవారం భద్రాద్రికొత్తగూడెం అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ వెల్లడించారు. ఆ వివరాలివీ.. జిల్లాలో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై తమకు అందిన సమాచారం మేరకు (మిగతా 6వ పేజీలో)

ప్రజా జీవనంలో 'గుమ్మడి' సూపర్‌స్టార్



- కన్నడ నటుడు శివరాజ్‌కుమార్
- సతీసమేతంగా నర్సయ్య స్వగ్రామానికి..
- ఘనస్వాగతం పలికిన గ్రామస్థులు
- నేడు పాల్వంచలో 'గుమ్మడి నర్సయ్య ప్రజల మనిషి' షూటింగ్ ప్రారంభం

6

మేం చేసిన అభివృద్ధే మా అభ్యర్థులను గెలిపిస్తుంది

- పదేళ్లలో రఘునాథపాలేన్ని అన్నిరంగాల్లో తీర్చిదిద్దాం
- బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాల్లో మాజీ మంత్రి పువ్వాడ అజయ్

7

దుప్పుల వేట ఘటనలో ఇద్దరి లొంగుబాటు

- గతంలోనే ఇద్దరి రిమాండ్.. నాలుగుకు పెరిగిన నిందితుల సంఖ్య
- అటవీ, వన్యప్రాణుల సంరక్షణ చట్టాల కింద కేసు

6



చొక్కాసుర దహనం నిర్వహిస్తున్న దృశ్యం

రామాలయంలో కృత్తికా దీపోత్సవం

- రామయ్యకు పంచవింశతి కలశ స్నపనం
- పాల్గొన్న భద్రాచలం ఏఎస్పీ, దేవస్థానం ఈవో
- నవంబరులో తగ్గిన భక్తుల సంఖ్య

భద్రాచలం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో శుక్రవారం కృత్తికా దీపోత్సవాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ప్రతి ఏటా కృత్తికా దీపోత్సవాన్ని రామాలయంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తూ ఉంటారు. ఈ క్రమంలో గురువారం రాత్రి ఇందుకు అంకురార్పణ గావించగా శుక్రవారం ఉదయం పంచవింశతి కలశ స్నపనం (25 కలశాలతో) నిర్వహించారు. అలాగే శ్రీసీతారామచంద్రస్వామి ఉత్సవమూర్తులకు సహస్రధారతో అభిషేకం నిర్వహించారు. అంతకుముందు నిత్యకల్యాణ మండపంలోకి శ్రీ సీతారామచంద్రస్వామిని మేళతాళాలతో తీసుకొచ్చారు. రాత్రి కృత్తికా దీపోత్సవాన్ని పురస్కరించుకొని ముందుగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం (మిగతా 6వ పేజీలో)

ముగిసిన నామినేషన్ల ఘట్టం

- 'మూడోవిడత' గడువు పూర్తి
- పలుచోట్ల ఉపసంహరణకు నై అంటున్న అభ్యర్థులు
- మూడో విడతలో 11చోట్ల ఒకే నామినేషన్
- తొమ్మిది పంచాయతీల్లో కాంగ్రెస్ పాగా
- ఓ చోట మాస్‌లైన్, మరో చోట స్వతంత్ర అభ్యర్థికి అవకాశం

ఖమ్మం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతిప్రతినిధి) : మూడువిడతల్లో జరుగుతున్న పంచాయతీ ఎన్నికల సమయంలో కీలకమైన నామినేషన్ల ఘట్టం శుక్రవారం ముగిసింది. మొదటి విడత ఎన్నికలు జరిగే పంచాయతీల బరిలో ఉన్న అభ్యర్థుల లెక్కలు తేలి.. వారంతా 11న జరిగే పోలింగ్‌కు సిద్ధమవుతుండగా.. రెండో విడత ఎన్నికలు జరిగే ఆరు మండలాల్లోని 183పంచాయతీలు, 1686వార్డులకు సంబంధించి శనివారం ఉపసంహరణ పూర్తికానుంది. దీంతో ఎందరు బరిలో ఉంటారో, ఎందరు ఉపసంహరించుకుంటారో... ఏకగ్రీవాల సంఖ్య బహిర్గతం కానుంది ఇప్పటికే ఒక్కనామినేషన్ దాఖలైన పంచాయతీలు ఐదు ఉన్నాయి. పాలేరు నియోజకవర్గంలోని ఖమ్మంరూరల్, కూసుమంచి, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం మండలాలతో పాటు ముదిగొండ మండలం పంచాయతీ ఎన్నికల ఏకగ్రీవాల లెక్క శనివారం తేలనుంది. దీంతో ఏకగ్రీవాల కోసం తుది ప్రయత్నంగా గట్టి ప్రయత్నాలు సాగిస్తున్నారు. మూడో విడతకు సంబంధించి 11పంచాయతీల్లో సర్పంచ్ పదవులకు ఒక్కో నామినేషన్ మాత్రమే దాఖలవడంతో ఆయా సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. వాటిలో కాంగ్రెస్ ఖాతాలో 9పంచాయతీలు చేరగా.. సీపీఐఎంఎల్‌మాస్‌లైన్ అభ్యర్థి ఒకరు, స్వతంత్ర అభ్యర్థి ఒకరు ఎన్నికయ్యారు. వీటిపై అధికారిక ప్రకటన చేయాల్సి ఉంది. ఏడు మండలాల్లోని 191 పంచాయతీలు, 1742 వార్డులకు సంబంధించిన నామినేషన్ల దాఖలు ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. పరిశీలన, తుది జాబితా అనంతరం ఏకగ్రీవాలు తేలనున్నాయి.



నారాయణపురం సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన వెంకటేశ్వర్లును అభినందిస్తున్న కాంగ్రెస్ నాయకుడు పొంగులేటి ప్రసాదరెడ్డి

మంత్రి పొంగులేటి స్వగ్రామం.. ఏకగ్రీవం

రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్వగ్రామమైన కల్లూరు మండలం నారాయణపురం గ్రామంలో సర్పంచ్, వార్డుల ఎన్నిక ఏకగ్రీవమైంది. గ్రామ ప్రముఖులైన పొంగులేటి ప్రసాదరెడ్డి, పొంగులేటి మహేందర్‌రెడ్డి సమక్షంలో గ్రామస్థులు సమావేశమై సర్పంచ్ ఎన్నిక విషయంలో ఏకాభిప్రాయానికి వచ్చారు. గ్రామ అభివృద్ధిని ఆకాంక్షిస్తూ సర్పంచ్ అభ్యర్థిగా వెంకటేశ్వర్లు ఒక్కడితో నామినేషన్ వేయించడంతో పాటు పది వార్డులకు కూడా ఒక్కో అభ్యర్థితోనే నామినేషన్లను (మిగతా 8వ పేజీలో)

పోలింగ్ సిబ్బంది రెండో విడత ర్యాండమైజేషన్ పూర్తి

సాధారణ ఎన్నికల పరిశీలకుడు ఖర్తడే కాళీచరణ్ సుదామరావు

ఖమ్మం కలెక్టరేట్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొదటి విడత పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్ సిబ్బంది కేటాయింపు కోసం రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్టు సాధారణ ఎన్నికల పరిశీలకుడు ఖర్తడే కాళీచరణ్ సుదామరావు అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియలో కలెక్టర్ అనుదీప్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాళీచరణ్ సుదామరావు మాట్లాడుతూ నిబంధనల ప్రకారం పోలింగ్ సిబ్బంది రెండో విడత ర్యాండమైజేషన్ నిర్వహించి మండలాల వారీగా సిబ్బందిని కేటాయించినట్టు తెలిపారు. 200ఓటర్ల వరకు ఉన్న పోలింగ్ కేంద్రాలకు 1 పీవో, 1 ఓపీఓ , 201 నుంచి 400 ఓటర్ల వరకు ఉన్న పోలింగ్ కేంద్రాలకు 1 పీవో, 2 ఓపీవోలు, 401 నుంచి (మిగతా 8వ పేజీలో)

ఉచ్చు బిగుస్తోంది!

- సైబర్ నేరంలో కొనసాగుతున్న దర్యాప్తు
- సత్తుపల్లి ప్రాంతంలో నిఘా వర్గాల సమాచార సేకరణ
- వేంసూరు మండలంలో మరో ముగ్గురి కోసం వేట
- ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు ప్రచారం

6

మారని హోంగార్డుల బతుకులు

- శాంతిభద్రతలు కాపాడడంలో హోంగార్డులు భేష్
- ఇప్పటికీ చాలీచాలని జీతాలు.. హెల్త్‌కార్డులూ కరువే..
- ఏళ్ల తరబడి పని చేస్తున్నా.. ఉద్యోగ భద్రత ఎక్కడ?
- నేడు 63వ హోంగార్డుల దినోత్సవం

ఉచ్చు బిగుస్తోంది!

- సైబర్ నేరంలో కొనసాగుతున్న దర్యాప్తు
- సత్తుపల్లి ప్రాంతంలో నిఘా వర్గాల సమాచార సేకరణ
- వేంసూరు మండలంలో మరో ముగ్గురి కోసం వేట
- ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు ప్రచారం

■ సత్తుపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి)

హైదరాబాద్‌లోని హైటెక్‌సిటీ కేంద్రంగా ఆస్ట్రేలియా పౌరులను మోసగించి రూ.కోట్లు కొల్లగొట్టిన కేసుకు సంబంధించి విచారణ ఇంకా కొనసాగుతోంది. ఈ కేసులో ప్రధాన నిందితులతో పాటు మరి కొందరిపై కూడా హైదరాబాద్‌కు చెందిన ఎస్‌వోటీ, సైబర్ క్రైం అధికారులు దృష్టి సారించినట్లు ప్రచారం సాగుతోంది. ఓవైపు కేసు దర్యాప్తులో భాగంగా ఈ ప్రాంతంలో మరికొందరిని అదుపులోకి తీసుకునేందుకు హైదరాబాద్ పోలీసులు ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు కాల్ సెంటర్ ఏర్పాటు చేసిన కల్లూరు మండలం ఎర్రబోయినపల్లికి చెందిన ప్రధాన సూత్రదారులు ప్రవీణ్, ప్రకాశ్ ఇప్పటికీ పరారీలో ఉన్నారు. ప్రధాన సూత్రదారులు ఈ ప్రాంతంలో ఎవరెవరిని ఉద్యోగులుగా, ఏజెంట్లుగా నియమించుకున్నారు!? వారిని ఎలా బాధ్యులను చేసి వాడుకున్నారనే విషయమై నిఘా వర్గాలు ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కేసులో ఇప్పటికే కల్లూరు మండలం లింగాల గ్రామానికి చెందిన యేపూరి గణేష్ (టెలీకాలర్), వేంసూరు మండలం లింగపాలెం గ్రామానికి చెందిన మోరంపూడి చెన్నకేశవ (26)లతో పాటు కోల్‌కతాకు చెందిన మరో ఏడు మందిని అరెస్టు చేశారు.

లోతుగా దర్యాప్తు

ఆస్ట్రేలియా పౌరులకు నకిలీ ఈ-మెయిల్స్ పంపి వారి కంప్యూటర్లను ఆధీనంలోకి తీసుకొని మీ కంప్యూటర్లు హ్యాక్ అయ్యాయని వారిని నమ్మించి.. సమస్య పరిష్కారం కోసం కస్టమర్ కేర్‌ను సంప్రదించాలని ఫోన్ నెంబర్ ఇచ్చేవారు. బాధిత ఆస్ట్రేలియన్లు ఫోన్ చేస్తే సమస్య తెలుసుకునే పేరుతో ఎనీ డెస్క్ సాఫ్ట్ వేర్ ద్వారా వారి కంప్యూటర్లను ఆధీనంలోకి తీసుకొని వారి బ్యాంకు ఖాతా, తదితర వివరాలు సేకరించేవారు. బ్యాంకు ఆన్‌లైన్ లాగిన్ ఐడీలు సేకరించి.. వారి ఖాతా నుంచి డబ్బును ఆస్ట్రేలియాలో నివాసం ఉంటున్న భారతీయుల ఖాతాలకు డబ్బు బదిలీ చేసుకొని.. అక్కడి నుంచి పలు మార్గాల్లో సొంతం చేసుకునేవారు. దీనికి సంబంధించి కేసు దర్యాప్తు చేస్తున్న సైబర్‌క్రైం, ఎస్‌వోటీ అధికారులు ప్రస్తుతం పూర్తి స్థాయి దర్యాప్తు కొనసాగిస్తున్నారని తెలిసింది. ఈ కేసులో ప్రధాన నిందితులతో పాటు మరికొందరు సత్తుపల్లి నియోజకవర్గానికి చెందిన వారు ఉన్నట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. ప్రధాన నిందితులు పరారీలో ఉండడంతో.. ఆస్ట్రేలియా నుంచి ఏ మార్గంలో డబ్బును ఇక్కడికి బదిలీ చేసుకున్నారు!? ఎవరెవరి ఖాతాలకు డబ్బు చేరిందనే విషయమై ఆరా తీస్తున్నారు. ఈ క్రమంలో వేంసూరు మండలానికి చెందిన ముగ్గురిని అరెస్టు చేసేందుకు హైదరాబాద్ నుంచి వచ్చినట్లు తెలిసింది. వీరిలో వేంసూరుకు చెందిన టి.పవన్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు తెలిసింది. ఈ విషయాన్ని అధికారులెవరూ ధ్రువీకరించలేదు.



నమ్మించి బ్యాంకు ఖాతాలు వాడుకొని..

కాల్ సెంటర్ ద్వారా ఆస్ట్రేలియా పౌరులను మోసగించి రూ. 8కోట్ల నుంచి 10 కోట్ల వరకూ డబ్బు కొట్టేసిన నిందితులు అక్కడి నుంచి డబ్బును ఎలా సొంతం చేసుకున్నారనే విషయమై దర్యాప్తు అధికారులు ఆరా తీస్తున్నారు. ఈ క్రమంలో ఆస్ట్రేలియాలో భారతీయుల బ్యాంకు ఖాతాలకు ముందుగా డబ్బు మళ్లించి.. అక్కడి నుంచి కొంత మేర డబ్బును సత్తుపల్లిలోని కొందరి ఖాతాల్లోకి మళ్లించారని పలువురు భావిస్తున్నారు. ఈ క్రమంలో బ్యాంకు ఖాతాలను వాడుకునేందుకు వారికి కొంత శాతం ముట్టజెప్పారని భావిస్తున్నారు. కమీషన్‌కు ఆశపడి బ్యాంకు ఖాతాల్లోకి డబ్బు మళ్లింపునకు ఒప్పందం చేసుకున్న వారు ప్రస్తుతం చిక్కుల్లో పడుతున్నారు.

నిఘా వర్గాల ఆరా

సైబర్ క్రైం కేసులో ఎర్రబోయినపల్లికి చెందిన ప్రధాన నిందితులు ఉండడంతో.. వారితో పాట వారి అనుచరులు, వారికి సహకరించింది ఎవరనే విషయమై నిఘా వర్గాలు వివరాలు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పరారీలో ఉన్న నిందితులతో ఎవరెవరికి సబంధాలున్నాయి!? ఏ స్థాయి వ్యక్తులు వారికి అండగా ఉన్నారనే విషయమై సమాచారాన్ని సేకరిస్తున్నాయి. సత్తుపల్లి పట్టణంలో కొందరికి ప్రధాన నిందితులతో ప్రత్యక్ష సంబంధాలున్నట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. నిందితులు గతంలో ఏమైనా నేరాలు చేశారా!? వారి ఆదాయ మార్గాలు ఏంటి !? అంటూ సమాచార సేకరణ జరుగుతున్నట్లు సమాచారం. ఇటీవల కాలంలో ఒక నిందితుడు పెద్ద మొత్తంలో భూములు కొనుగోలు చేసేందుకు ప్రయత్నాలు చేసినట్లు చెబుతున్నారు. దీంతో ప్రధాన నిందితుల ప్రధాన ఆదాయం ఏంటనే విషయమై నిఘా వర్గాలు సమాచారం సేకరిస్తున్నాయని తెలిసింది. ఇందులో భాగంగానే ఈ ప్రాంతంలో ప్రవీణ్, ప్రకాశ్‌లకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన, సహకరిస్తున్న వారి వివరాలు ఇప్పటికే సేకరించినట్లు తెలిసింది.

మారని హోంగార్డుల బతుకులు

- శాంతిభద్రతలు కాపాడడంలో హోంగార్డులు భేష్
- ఇప్పటికీ చాలీచాలని జీతాలు.. హెల్త్‌కార్డులూ కరువే..
- ఏళ్ల తరబడి పని చేస్తున్నా.. ఉద్యోగ భద్రత ఎక్కడ?
- నేడు 63వ హోంగార్డుల దినోత్సవం



ఖమ్మంక్రైం / కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, డిసెంబరు 5 : శాంతి భద్రతల సంరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నా.. గుర్తింపు దక్కని ఏకైక విభాగంగా హోంగార్డ్స్ మాత్రమే. వారు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివి . చాలీచాలని వేతనాలతో కుటుంబ పోషణ భారంగా మారిన ఏళ్ల తరబడి పని చేస్తున్నా.. ఉద్యోగ భద్రత లేక హోంగార్డులు ఇబ్బందులు పడుతున్నారు. శనివారం జాతీయ 63వ హోంగార్డుల దినోత్సవం సందర్భంగా కథనం..

1963లో హోంగార్డు వ్యవస్థ ప్రారంభం

1963, డిసెంబరు 6న అప్పటి ప్రధానమంత్రి మొరార్జీదేశాయ్ దేశంలో హోంగార్డుల వ్యవస్థను ప్రారంభించారు. 1992లో హోంగార్డులకు రోజుకు రూ.22చెల్లించేవారు. ప్రస్తుతం ప్రభుత్వం హోంగార్డులకు రోజుకు రూ.745 చొప్పున నెలకు రూ.22,350 జీతంగా ఇస్తున్నారు. గతంలో వీరికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి జీతాలు ఇచ్చేవి. ప్రస్తుతం మాత్రం రాష్ట్ర ప్రభుత్వం మాత్రమే చెల్లిస్తుంది. ముందు వీరిని గార్డులు అని పిలిచేవారు. రానురాను వీరిని హోంగార్డులుగా పిలుస్తున్నారు.

ఖమ్మం జిల్లాలో 560మంది, భద్రాద్రి జిల్లాలో 450 మంది..

ఖమ్మం జిల్లాలో 560మంది హోంగార్డులు ఉండగా. వీరిలో మహిళా హోంగార్డులు 45మంది, 515మంది పురుషులు ఉన్నారు. వీరిలో 445 మంది లాఅండ్ ఆర్డర్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఓడీ డ్యూటీలో 60మంది, ట్రాఫిక్‌లో 22మంది, మిగతావారు మాధారం స్టీల్ ప్లాంట్, ఆర్టీవో, రైల్వే విభాగాలలో పని చేస్తున్నారు. అలాగే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 450 మంది హోంగార్డు ఆఫీసర్స్ విధులు నిర్వహిస్తున్నారు. అందులో 400 మంది పురుషులు, 50 మంది మహిళలు ఉన్నారు. వీరు జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్లతో పాటు దక్షిణ అయోధ్యగా పేరు గడిచిన భద్రాచలం దేవస్థానంలో, పాల్వంచలోని కేటీపీఎస్ థర్మల్ పవర్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. భద్రత లేకుండా ఏళ్ల తరబడి పని చేస్తున్న హోంగార్డుల విధులు వెట్టి చాకిరీని తలపిస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

హెల్త్‌కార్డులు లేవు.. ఎక్స్‌గ్రేషియా లేవు..

రోడ్లపై, పోలీసుస్టేషన్లలో ఎండను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వర్తించే హోంగార్డులకు ఇప్పటి వరకు ఎలాంటి హెల్త్‌కార్డులు లేవు. గతంలో ప్రభుత్వాలు ఇస్తామని హామీ ఇచ్చినా.. ఇప్పటివరకు ఎవరూ అమలు చేయలేదు. దీంతో ఏదైనా కష్టం వస్తే సిబ్బంది ఒకరికి ఒకరు సహకరించుకుంటూ విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ విషయమై హోంగార్డులు పలుమార్లు మంత్రులకు, అధికారులకు వినతులు అందించారు. అయినా కూడా ఇప్పటి వరకు ఎలాంటి స్పందన లేదు.

నేటి పరేడ్ రద్దు

ప్రతీ ఏడాది హోంగార్డు దినోత్సవం సందర్భంగా నిర్వహించే పరేడ్ కార్యక్రమాన్ని శనివారం రద్దు చేశారు. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు హోంగార్డులు తెలిపారు.

హోంగార్డులకు ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలి

బంకా శ్రీను (హోంగార్డు సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు)



హోంగార్డుల కష్టాన్ని చూసి ప్రభుత్వం అర్హులైన వారికి ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలి. చాలీచాలని జీతాలతో హోంగార్డులు అనేక రకాలుగా ఇబ్బందులకు గురవుతున్నారు. కొంతమందికి కనీసం ఉండేందుకు ఇళ్లు కూడా లేవు. అలాంటి హోంగార్డులను గుర్తించి ప్రభుత్వం ఇళ్ల మంజూరు చేయాలి.

హోంగార్డు ఆఫీసర్స్ పని తీరు భేష్

భద్రాద్రి జిల్లా హోంగార్డ్స్ ఆఫీసర్స్ ఆర్ఐ నరసింహారావు



పోలీసు శాఖలో ఒక భాగమై పోలీసులతో సమానంగా నిరంతరం విధులు నిర్వర్తిస్తూ హోంగార్డు ఆఫీసర్స్ అందిస్తున్న సేవలు అమోఘం. వరదలు సంభవించినప్పుడు, బందోబస్తులో, ఎన్నికల సమయంలో రోజువారీ విధులలో హోంగార్డు ఆఫీసర్స్ అంకిత భావంతో సేవలందిస్తున్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలకు రక్షణ కల్పించడంతో బాధ్యతాయుతమైన సేవలు అందించడంతో పాటు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో పూర్తి చేస్తారు. అదేవిధంగా ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న ఐటీడీఏ పీవో రాహుల్

విధుల పట్ల బాధ్యత కలిగి ఉండాలి : పీవో

హెచ్‌ఎంను బాధ్యతల నుంచి తప్పించాలని ఆదేశం

దుమ్ముగూడెం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విధుల పట్ల హెచ్‌ఎంలు, వార్డెన్లు ప్రత్యేక బాధ్యత కలిగి ఉండాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. మండలంలోని నారాయణరావుపేట, మంగువాయిబాడవ ఆశ్రమ ఉన్నత పాఠశాలలతోపాటు గంగారం, ఆదర్శనగర్ జీపీఎస్‌లను శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. తొలుత నారాయణరావుపేట ఆశ్రమపాఠశాలను సందర్శించారు. ముందస్తు అనుమతి తీసుకోకుండాసెలవుపై వెళ్లిన హెచ్‌ఎం శ్రీనివాస్‌కు షోకాజ్ నోటీసు జారీతోపాటు, హెచ్‌ఎం బాధ్యతల నుంచి తప్పించాలని డీడీ అశోక్‌ను ఆదేశించారు. అనంతరం అక్కడ జరుగుతున్న అదనపు తరగతి భవనాల నిర్మాణాన్ని పరిశీలించారు. అనంతరం మంగువాయిబాడవ బాలికల ఆశ్రమపాఠశాలను సందర్శించి విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా!? అని వారిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు సమయానుకూలంగా మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. హెచ్‌ఎం, వార్డెన్లు తిన్న తర్వాతే వారికి వడ్డించాలని ఆదేశించారు. ప్రతీ నెల రెండవ శుక్రవారం తప్పని సరిగా కెరీర్ గైడెన్స్‌పై ప్రత్యేక తరగతులు నిర్వహించాలని హెచ్‌ఎంలకు సూచించారు. ఆదర్శనగర్ జీపీఎస్ పాఠశాలలో ఉద్దీపకం వర్క్‌బుక్ నిర్వాహణ సరిగా లేకపోవడంతో సంబంధిత టీచర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారంలోగా ఉద్దీపకం వర్క్‌బుక్‌లోని అంశాలు ప్రతీ పిల్లవానికి అర్థమయ్యేలా బోధించేలా చూడాలని, వారానికి రెండు రోజులు దగ్గరుండి ఉద్దీపకం నిర్వహణ సక్రమంగా అమలయ్యేలా చూడాలని ఎస్సీఆర్పీ విటల్‌కు ఆదేశాలు జారీ చేశారు. పిల్లలు అర్థం చేసుకొని చెప్పలేని పక్షంలో తప్పని సరిగా కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. గంగారం జీపీఎస్ పాఠశాలలో ఉద్దీపకం వర్క్‌బుక్‌లోని అంశాలను పిల్లల చేత బ్లాక్‌బోర్డుపై రాయించి, ప్రశ్నించి సంతృప్తి వ్యక్తం చేశారు. హెచ్‌ఎం వీరమ్మ, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం బాలాజీ, జీపీఎస్ టీచర్లు నిర్మల, లక్ష్మి, ఎస్సీఆర్పీ విఠల్ పాల్గొన్నారు.

రామాలయంలో కృత్తికా దీపోత్సవం

(5వ పేజీ తరువాయి)

నిర్వహించారు. ఈ సమయంలో దీపాన్ని వెలిగించి ఉత్సవమూర్తులు, మూలవరుల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి ఆ దీపంతో ఆలయ ప్రాంగణంలో దీపాలను వెలిగించారు. అనంతరం చొక్కాసుర దహనం నిర్వహించారు. కార్యక్రమంలో భద్రాచలం ప్రథమశ్రేణి న్యాయాధికారి శివనాయక్, భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్, దేవస్థానం ఈవో కె.దామోదర్ రావు, సీఐ నాగరాజు, ఎస్ఐలు రామకృష్ణ, సతీష్, వైదిక పరిపాలన సిబ్బంది పాల్గొన్నారు. అలాగే శుక్రవారం సందర్భంగా స్వామి వారు స్వర్ణభద్ర కవచాలతో దర్శనమివ్వగా భక్తులు దర్శించుకున్నారు. అలాగే స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. అదేవిధంగా నవంబరు నెలలో స్వామి వారిని 1,95,524 మంది భక్తులు దర్శించుకున్నారు. కాగా గతేడాదితో నవంబరుతో పోలిస్తే ఈసారి భక్తుల సంఖ్య 26,499 మంది భక్తుల సంఖ్య తగ్గింది.

పుర ప్రముఖులు, వివిధ సంఘాల నాయకులతో ఈవో సమావేశం

భద్రాచలంలోని పుర ప్రముఖులు, వివిధ సంఘాల వారు పగల్‌పత్తు ఉత్సవాల్లో ఎక్కువగా భాగస్వామ్యం కావాలని దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం రామాలయంలోని చిత్రకూట మండపంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భద్రాచలం వచ్చే భక్తులకు వివిధ రూపాల్లో సేవలందించాలని కోరారు. కార్యక్రమంలో దేవస్థానం ఏఈవోలు శ్రావణ్‌కుమార్, భవానీరామకృష్ణ, ఈఈ రవీంద్రనాథ్, శ్రీరామాయణ పారాయణదారు ఎస్టీజీ కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

తగ్గేదే లే!

(5వ పేజీ తరువాయి)

పోటీ చేస్తున్నారు. అలాగే 19వ వార్డులో కాకా వీరయ్య పోటీ చేస్తుండగా 18వ వార్డులో ఆయన భార్య పుష్పావతి బరిలో ఉన్నారు. చర్ల మండలం టీ కొత్తగూడెం పంచాయతీలో సర్పంచ్ పదవికి ఇర్పామాధవి, ఇర్పా ఉమ తోటికోడళ్లు బరిలో ఉన్నారు. ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య స్వగ్రామం కోయగూడెంలో ఎమ్మెల్యే సోదరుల కుటుంబాలు సర్పంచ్ పదవికి పోటీ పడుతున్నాయి. కోరం కనకయ్య అన్న కుమారుడు సుభాస్‌చంద్రబోస్ కాంగ్రెస్ తరుపున బరిలో ఉండగా ఎమ్మెల్యే సోదరుడు నరసింహారావు కోడలు రమణ బీఆర్ఎస్ తరుపున పోటీలున్నారు. లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల పంచాయతీలో ఒకే కుటుంబానికి చెందిన పిన్ని, వరుసకు కూతరు ఇద్దరూ నామినేషన్లు వేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మద్దతుతో మలకం సౌందర్య తన బాబాయి భార్య మలకం లక్ష్మి (పిన్ని)పై పోటీ చేస్తున్నారు. పిన్ని మలకం లక్ష్మికి సీపీఐ మద్దతు ఉంది. ఇలా ఉమ్మడిజిల్లాల్లో పలు చోట్ల రక్త సంబంధీకులు పలు చోట్ల దగ్గరి బంధువుల మధ్య పోటీ నడుస్తోంది. బంధువుల మధ్య పోటీ ఉన్న చోట్ల ఎన్నిక ఆసక్తిగా మారింది.

హెరిటేజ్ సంస్థ సీఈవోను పరామర్శించిన నారా భువనేశ్వరి

అశ్వాపురం డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మొండికుంట గ్రామానికి చెందిన హెరిటేజ్ సంస్థ సీఈవో జంగం సాంబమూర్తిని శుక్రవారం ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి పరామర్శించారు. సాంబమూర్తి తండ్రి జంగం కొమరయ్య ఇటీవల తీవ్ర అనారోగ్యంతో మృతిచెందాడు.కాగా హైదరాబాద్ నుంచి జంగారెడ్డిగూడెం వెళుతున్న భువనేశ్వరి మార్గమధ్యంలో మొండికుంటలో సాంబమూర్తి ఇంటికి చేరుకుని కొమరయ్యకు నివాళులర్పించారు. సాంబమూర్తిని ఓదార్చి కుటుంబసభ్యుల వివరాలను తెలుసుకున్నారు.అనంతరం మల్లెలమడుగులో ప్రధాన రహదారి వెంట నిర్మిస్తున్న ఎన్‌టీఆర్ విగ్రహ నిర్మాణాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కు ఎంపిక

జూలూరుపాడు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కు మండలంలోని కాకర్ల ఉన్నత పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు, జిల్లా సైన్స్ అధికారి బి. సంపత్ కుమార్ ఎంపికయ్యారు. శుక్రవారం ఆయనకు నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ ఇండియా నుంచి ఆహ్వానం అందింది. చండీఘర్‌లోని పంజాబ్ యూనివర్సిటీలో ఈ నెల 6 నుంచి 9వ తేదీ వరకు ఇండియా ఇంటర్నేషన ల్ సైన్స్ ఫెస్టివల్ వర్క్ షాప్ జరగనుంది. ఈ వర్క్ షాపులో ఉపాధ్యాయ 'బోధనలు-మెళకువలు' అన్న అంశంపై ఆయన పాల్గొంటున్నారు. సంపత్ కుమార్ ఎంపిక కావడం పట్ల జిల్లా విద్యాశాఖ అధికారి బి. నాగలక్ష్మి, ఏఎంఓ నాగరాజశేఖర్, ఎంఈఓ బి. జుంకీలాల్, కాకర్ల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంజీవరావు, సిబ్బంది అభినందించారు.



సంపత్ కుమార్

బీఆర్ఎస్ అభ్యర్థిపై దాడి చేసిన కాంగ్రెస్ నాయకులు

టేకులపల్లి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): శుక్రవారం కోయగూడెం బీఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న పూనెం కరుణాకర్‌పై కాంగ్రెస్ నాయకులు చుక్కాలబోడు నామినేషన్ స్వీకరణ కేంద్రంలో దాడులకు గురిచేశాడని పేర్కొంటూ అభ్యర్థి కరుణాకర్ రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదుచేశాడు. నామినేషన్ కేంద్రంలో బీఆర్ఎస్ కోయగూడెం సర్పంచ్ అభ్యర్థితో పాటు వార్డు అభ్యర్థులు లైన్‌లో నిలబడి ఉండగా కాంగ్రెస్ నాయకులు కోరం సురేందర్, ఉమాలు తమపై దాడికి పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులపై ఎలాంటి దాడులకు పాల్పడిన సహించేది లేదని మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్ హెచ్చరించారు.

ప్రజా జీవనంలో 'గుమ్మడి' సూపర్‌స్టార్

ఆయన ప్రజాఉద్యమాల స్ఫూర్తితో కథానాయకుడిగా.. : కన్నడ సూపర్‌స్టార్ శివరాజ్‌కుమార్

ఇల్లెందు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సినిమాల్లో తమను అభిమానులు సూపర్‌స్టార్లుగా భావిస్తారని, కానీ ప్రజల కోసం పనిచేస్తున్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య ప్రజాజీవనంలో సూపర్ స్టార్‌గా నిలిచారని కన్నడ సూపర్‌స్టార్ శివరాజ్‌కుమార్ పేర్కొన్నారు. తన తండ్రి రాజ్‌కుమార్ ప్రజల కోసం రాజకీయ రంగంలో అనేక కార్యక్రమాలు చేపట్టి ప్రజల అభిమానాన్ని చూరగొన్నారని, గుమ్మడి నర్సయ్య సైతం ప్రజల కోసం నిరంతరం తపిస్తూ ఉద్యమాలు సాగించారని వారి జీవితం భావితరాలకు ఆదర్శంగా నిలుస్తుందని వివరించారు. శనివారం 'గుమ్మడి నర్సయ్య ప్రజల మనిషి' చిత్రం షూటింగ్ ప్రారంభోత్సవం పాల్వంచలో జరగనున్న సందర్భంగా.. ఈ చిత్ర హీరో కన్నడ సూపర్‌స్టార్ శివరాజ్‌కుమార్ శుక్రవారం సాయంత్రం జిల్లాకు చేరుకున్నారు. తొలుత కుటుంబసమేతంగా ఇల్లెందు సమీపంలోని గుమ్మడి నర్సయ్య స్వగ్రామం సింగరేణి మండలం టేకులగూడెం గ్రామానికి వెళ్లారు. అక్కడ గుమ్మడినర్సయ్యను కలిసిన శివరాజ్‌కుమార్‌కు టేకులగూడెం గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. అనంతరం శివరాజ్‌కుమార్ విలేకరులతో మాట్లాడుతూ.. గుమ్మడి నర్సయ్య పాత్ర ధరించడం తన అదృష్టమని, నర్సయ్యలాంటి ఆదర్శవంతమైన నాయకుడి పాత్ర లభించడం తన భాగ్యంగా భావిస్తున్నానని అన్నారు. మా గుమ్మడి నర్సయ్య తనకు తండ్రి లాంటి వారని తాను గుమ్మడి నర్సయ్య రాజకీయాల్లో నిబద్ధత, నిజాయితీ నిరాడంబరత గురించి దర్శకుడు పరమేశ్వర్ హీర్వాలే చెప్పగానే ఆయన పాత్రలో నటించడానికి సంతోషంగా అంగీకరించానని తెలిపారు. దర్శకుడు పరమేశ్వర్ హీర్వాలే మాట్లాడుతూ.. గుమ్మడి నర్సయ్య ప్రజా ఉద్యమాల నేపథ్యాన్ని సినిమాగా నిర్మించాలని మూడేళ్లుగా ప్రయత్నిస్తున్నాన్నారు. ప్రజలమనిషి గుమ్మడి నర్సయ్య పాత్రకు శివరాజ్‌కుమార్ అయితేనే న్యాయం జరుగుతుందన్నారు. సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ కార్యదర్శి పి.రంగారావు మాట్లాడుతూ.. కన్నడ ప్రజల హృదయాలను చూరగొన్న రాజ్‌కుమార్ తనయుడు సూపర్‌స్టార్ శివరాజ్ కుమార్ ప్రజల మనిషిగా విప్లవ బాటలో సాగుతున్న గుమ్మడి పాత్రను పోషించడం అభినందనీయమన్నారు. గుమ్మడి నర్సయ్య జీవితాన్ని ఇతివృత్తంగా నిర్మిస్తున్న చిత్రం ప్రపంచ వ్యాప్తంగా ప్రజా ఉద్యమాల శ్రేణుల మన్ననలు పొందుతుందని ఆకాంక్షించారు. నటుడు శివరాజ్‌కుమార్ వెంట ఆయన సతీమణి, కర్నాటక మాజీ ముఖ్యమంత్రి కూతురు గీతాశివరాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కన్నడ నటుడు రాజ్‌కుమార్, గుమ్మడి నర్సయ్య, పోటు రంగారావు తదితరులు

నేడు పాల్వంచలో షూటింగ్ ప్రారంభం : నిర్మాత సురేష్‌రెడ్డి

పాల్వంచ : ప్రవల్లిక ఆర్ట్ క్రియేషన్స్ బ్యానర్‌పై ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య జీవితచరిత్ర కథాంశంగా తెరకెక్కిస్తున్న చిత్రంలో శివరాజ్‌కుమార్ హీరో పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమాకు పాల్వంచకు చెందిన నల్లా సురేష్‌రెడ్డి నిర్మాతగా వ్యవహరిస్తునున్న నేపథ్యంలో చిత్ర ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని పాల్వంచలో ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో సురేష్‌రెడ్డి శుక్రవారం పాల్వంచ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చిత్ర విశేషాలు వెల్లడించారు. మచ్చలేని శాసనసభ్యుడిగా పేరుపొందిన గుమ్మడి నర్సయ్య జీవిత చరిత్రకు ఉన్న ప్రత్యేకతను ప్రజలందరికీ తెలియజేయాలనే సంకల్పంతో తాను ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు.

శనివారం పాల్వంచలోని హెచ్ కన్వెన్షన్ హాల్‌లో ఉదయం 10గంటలకు జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమానికి హీరో శివరాజ్‌కుమార్‌తో పాటు రాజకీయ, సినీ ప్రముఖులు హాజరవుతున్నారని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, వీఆర్‌కే రెడ్డి, ప్రశాంత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గుమ్మడి నర్సయ్యగా కన్నడ హీరో

ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే జీవితమే కథాంశంగా సినిమా

టైటిల్ రోల్‌లో శివరాజ్ కుమార్

నేడు పాల్వంచలో చిత్ర ప్రారంభ పూజ

ఇల్లెందు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఐదు పర్యాయాలు ఇల్లెందు ఎమ్మెల్యేగా పనిచేసినా.. నేటికీ సాధారణ జీవనం గడుపుతున్న కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు లెనినిస్ట్ పార్టీ నాయకుడు గుమ్మడి నర్సయ్య జీవితచరిత్ర ఆధారంగా 'గుమ్మడి నర్సయ్య ప్రజల మనిషి' అనే టైటిల్‌తో సినిమా నిర్మాణం జరుగుతోంది. కన్నడ సూపర్‌స్టార్ శివరాజ్‌కుమార్ గుమ్మడి నర్సయ్య పాత్ర పోషిస్తున్న ఈ చిత్రంలో తాను నమ్మిన పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి రాజకీయాల్లో కొనసాగుతున్న గుమ్మడి నర్సయ్య జీవిత చరిత్రను చూపబోతున్నారు. ఇల్లెందు సమీపంలోని సింగరేణి మండలం టేకులగూడెం గ్రామానికి చెందిన గుమ్మడి సర్పంచ్‌స్థాయి నుంచి రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఉసిరికాయలపల్లి సర్పంచ్‌గా తొలుత ఎన్నికైన ఆయన 1983లో సీపీఐ ఎంఎల్ పార్టీ నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఒక్కసారి ఎమ్మెల్యే అయితేనే హంగు ఆర్భాటాలతో హంగామా చేసే నేతలున్న నేటి రోజుల్లో ఐదు సార్లు ఎమ్మెల్యేగా చేసిన గుమ్మడి మాత్రం నేటికీ నిరాడంబర జీవితం గడుపుతూ ప్రజా సమస్యలపై అనేక ఉద్యమాల్లో పాల్గొంటున్నారు. పేద, బలహీనవర్గాల ప్రజల సమస్యలు, పోడు భూముల పరిరక్షణ, ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై గళంవిప్పే ఆయన జీవితాన్ని వెండితెరపైకి ఎక్కిస్తుండటం ఆసక్తికర పరిణామం. ప్రవల్లిక ఆర్ట్ క్రియేషన్స్ పతాకంపై పాల్వంచకు చెందిన నల్లా సురేష్‌రెడ్డి నిర్మాతగా, పరమేశ్వర్ హిర్వాలే దర్శకుడిగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. అయితే 2022లోనే ఈ చిత్రాన్ని ప్రకటించగా.. నర్సయ్య జీవితంలోని అనేక అంశాలు, తెలియని కోణాలను సేకరించేందుకు ఇంతసమయం పట్టింది. ఈ చిత్రంలో గుమ్మడినర్సయ్యగా కన్నడ సూపర్‌స్టార్ శివరాజ్‌కుమార్ నటిస్తున్నారు.

దుప్పుల వేట ఘటనలో ఇద్దరి లొంగుబాటు

సత్తుపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి అర్బన్‌పార్కులో దుప్పులను వేటాడిన నిందితుల్లో ఇద్దరు శుక్రవారం రాత్రి అటవీ డివిజన్ కార్యాలయం వద్ద లొంగిపోయారు. అర్బన్ పార్కులో వేట వ్యవహారం కలకలం రేపగా.. ప్రధాన నిందితులుగా ఉన్న ఇద్దరు తామే స్వయంగా కార్యాలయానికి వచ్చి లొంగిపోయారు. తుపాకీతో వేట జరిగిందనే విషయంలో అధికారులు ఇటీవలే ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించడం, మరో ఇద్దరు లొంగిపోవడం జరిగిందే తప్ప పూర్తిగా వేట జరిగిందా? లేదా? ఎన్ని చుక్కల దుప్పులు బలయ్యాయి? గాయాలైనవి ఎన్ని!? వంటి సమాచారం మాత్రం బయట పెట్టలేదు.

నలుగురిపై కేసులు నమోదు

ఇప్పటికే ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా.. మరో ఇద్దరు ప్రధాన నిందితులను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్టు ఎఫ్‌డీవో వాడపల్లి మంజుల తెలిపారు. సత్తుపల్లి అటవీ ప్రాంతంలో అక్రమ వేట కార్యకలాపాలు జరుగుతున్నాయనే విశ్వసనీయ సమాచారం ఆధారంగా జిల్లా టాస్క్‌ఫోర్స్, సత్తుపల్లి అటవీ శాఖ అధికారులు విచారణ చేపట్టామన్నారు. ఈనెల 1వ తేదీన సత్తుపల్లికి చెందిన పంతంగి గోపీకృష్ణ (ఏ1), సొంటి శ్రీరామ్‌ప్రసాద్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. మిగతా ఇద్దరిలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం తాటిసుబ్బన్నగూడేనికి చెందిన మెచ్చా రఘు (ఏ2), గొర్రెగుట్టకు చెందిన కుంజా భరత్ (ఏ4)లను సత్తుపల్లి కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించామన్నారు. వీరిపై టీజీ ఫారెస్ట్ యాక్ట్-1967, వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్ యాక్ట్-1972లోని సంబంధిత విభాగాల కింద కేసులు నమోదు చేశామన్నారు.

జీపీఎస్ మార్చి.. అధికారులను ఏమార్చి

(5వ పేజీ తరువాయి)

ఈ నెల రెండోతేదీన సాయంత్రం 4.15గంటల సమయంలో విజిలెన్స్ అధికారులు పాల్వంచలోని జీసీసీఎస్ ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద నిఘా ఏర్పాటు చేశారు. ఆ సమయంలో ఏపీ20ఏవీ1899 నెంబరుగల ద్విచక్రవాహనంపై వచ్చిన ఓ యువకుడు స్టాక్ పాయింట్‌లోకి ప్రవేశించి ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జ్ సత్యవతి, డేటా ఎంట్రీ ఆపరేటర్ బానోతు కృష్ణకుమార్‌కు పత్రాలు అందజేయగా... వారు కొంత సమాచారం నమోదు చేసి తిరిగి ఆయనకు పత్రాలు అందించారు. దానిపై అనుమానం వచ్చిన విజిలెన్స్ అధికారులు ఎంఎల్ఎస్ పాయింట్ ప్రధానగేటు వద్ద సదరు యువకుడిని ఆపి విచారించగా.. అతడిపేరు ప్రశాంత్‌గా పేర్కొంటూ, ఆయన స్టేజీ -1 కాంట్రాక్టర్ ఎన్.శ్రీనివాస్‌కు అసిస్టెంట్‌గా పనిచేస్తున్నట్టు వివరించాడు. ఎంఎల్ఎస్ పాయింట్ సిబ్బందితో కలిసి మల్లారం వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాం నుంచి ఎంఎల్ఎస్ పాయింట్‌కు రావాల్సిన పీడీఎస్ సన్నబియ్యానికి సంబంధించి లారీకి ఉండాల్సిన జీపీఎస్ ట్రాకింగ్‌ను ద్విచక్రవాహనానికి అమర్చి లారీ నెం. టీఎస్29టీ5139కు సంబంధించిన ట్రక్ చిట్‌నంబరు 4346 ద్వారా 300 క్వింటాళ్ల బియ్యాన్ని నల్లబజారుకు మళ్లించినట్టు వివరించాడు. ఈ వ్యవహారంలో ఎంఎల్ఎస్ పాయింట్ సిబ్బంది, పీడీఎస్ డీలర్లు కలిసి తప్పుడు పత్రాలతో ప్రభుత్వానికి భారీ ఆర్థిక నష్టం కలిగించినట్టు అదనపు కలెక్టర్ తెలిపారు. పంచనామా అనంతరం ప్రశాంత్‌ను అదుపులోకి తీసుకున్నట్టు ఆయన తెలిపారు.

మిల్లర్‌కు మళ్లించేందుకు పన్నాగం

300 క్వింటాళ్ల అక్రమం జరిగినట్టుగా గుర్తించిన అధికారులు స్టేజీ-1 కాంట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా. ఆయన భార్య ఎన్. సరోజ పేరుతో కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నారని, మణుగూరుకు చెందిన రమ్యా రైస్ ట్రేడర్స్ రైస్ మిల్‌కు పీడీఎస్ బియ్యాన్ని మళ్లించేందుకు జీపీఎస్ వ్యవస్థను మార్చి లారీలను అతని మిల్లుకు తరలించేవారని అంగీకరించడంతో పాటు.. ప్రతీ లారీకి రూ.50వేలు ఐదుసార్లు పంపించినట్టుగా అంగీకరించాడు. అనంతరం టీఎస్29టీ5139 నెంబరు ఉన్న లారీని నగిరిపేట శివారులో గుర్తించిన అధికారులు డ్రైవర్ అనిల్‌ను విచారించగా. రైస్‌మిల్లర్ సూచనల మేరకు అక్కడ నిలిపివేసినట్టు తెలిపాడు. కాగా బియ్యాన్ని రికవరీ చేసుకున్న అధికారులు ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జ్ సత్యవతి, డేటా ఎంట్రీ ఆపరేటర్ కృష్ణకుమార్, హమాలీ నాగరాజు సహకారంతో పలువురు డీలర్ల ఒత్తిడితో నకిలీ ఎంట్రీలు చేశారని అదనపు కలెక్టర్ వివరించారు. డీలర్లు పీడీఎస్ బియ్యం అందుకున్నట్టుగా బయోమెట్రిక్ సంతకాలు చేశారు కానీ అసలు బియ్యం మాత్రం పొందలేదని, లారీకి నకిలీ రశీదుల కోసం ఎంఎల్ఎస్ సిబ్బంది లంచాలు తీసుకున్నట్టు ఆయన తెలిపారు. పీడీఎస్ మళ్లింపులో ఓ మాఫియా రింగ్ పనిచేస్తున్నట్టు గుర్తించిన అధికారులు 15మందిపై కేసు నమోదు చేసి, 13 మందిని అరెస్ట్ చేశారు. ఈ సమావేశంలో డీఎస్‌వో ప్రేమ్ కుమార్, ఓఎస్‌డీ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.


సీట్లు ఓకే... సొమ్ములెలా..?

డబ్బు కోసం అభ్యర్థుల తంటాలు

గ్రామ పెద్దల ద్వారా అప్పులు!

భూమి తనఖాతో కొందరు,

అమ్మకంతో మరి కొందరు..



అశ్వారావుపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో పోటీ చేయాలంటే ఏదో పార్టీ తరపున సీటు సాధించడం ఒక ఎత్తు. సీటు ఖరారు కాగానే గెలుపు కోసం సమీకరణలు, పెద్దల మద్దతు, సంఘీభావంతో పాటు మరో ముఖ్యమైన అంశం నగదు ఎన్నికల్లో ప్రధానాంశంగా మారనుంది. సొమ్ములేనిదే అడుగుకూడా పడే పరిస్థితిలేదు. సొమ్ములు ఇవ్వకపోతే నిన్నమొన్నటి వరకు వెంటే నడిచినవారు కూడా దావత్ లేకపోతే ఎలాఅంటూ అభ్యర్థులపై బెదిరించే పరిస్థితి ఉంది. ఎన్నికల ప్రచార సామగ్రి, ప్రచారానికి కార్యకర్తల మద్దతు, ఎన్నికల ప్రక్రియలో భాగంగా చివరి రోజుల్లో జరిగే పంపకాలు, మధ్య మధ్యలో మద్యం ఇతరత్రా కార్యక్రమాలు జరిపితే కానీ ఎన్నికల్లో ముందుకెళ్లే పరిస్థితి లేదు. పదవి కోసం వీటన్నింటికీ లక్షల్లోనే ఖర్చు అవుతుంది. కొంతమేర మద్దతుగా నిలచిన పార్టీల నుంచి సహకారం లభించినప్పటికీ సర్పంచ్ అభ్యర్థి ఆ పంచాయతీలోని ఓట్లను బట్టి కనీసం రూ.10 నుంచి రూ.25 లక్షలకు పైగా ఖర్చయ్యే అవకాశం ఉందంటున్నారు. జనరల్ స్థానాల్లో అయితే ఈ ఖర్చు మరింత పెరిగే అవకాశం ఉంది. దీంతో పోటీలో ఉన్న అభ్యర్థులు నానా పాట్లు పడుతూ పైసలు కోసం పరుగులు పెడుతున్నారు. ఈ మండలం ఏజెన్సీ ప్రాంతం కావడంతో అందరూ గిరిజన అభ్యర్థులే ఎక్కువగా ఉన్నారు. సీటు ఖరారైన వారు సొమ్ముల కోసం పరుగులు పెడుతున్నారు. కొందరు నోట్లు రాసి అప్పులు తెస్తుండగా, మరి కొందరు భూములు, ఇతరత్రా ఆస్తులు తనఖా పెట్టి పైసలు సమకూర్చుకుంటున్నారు. మరి కొందరు భూములను విక్రయానికే పెడుతున్నారు. అవేమి లేని అభ్యర్థులకు గ్రామంలో మద్దతుగా ఉన్న పెద్దల హామీలపై నోట్లు రాయించి అప్పులు ఇప్పిస్తున్నారు. ఏజెన్సీ పంచాయతీల్లో ఉప సర్పంచ్ అభ్యర్థులుగా ఉన్న వారు కీలకమయ్యే అవకాశాలుండటంతో ఆ వ్యక్తితో కొంత సొమ్మును పెట్టించే ప్రయత్నాలు చేస్తున్నారు. తెలిసిన బంధువులు, స్నేహితులకు ఫోనులు చేసి ఆర్థిక సహకారం కోసం ప్రయత్నం చేస్తున్నారు. శనివారం ఉప సంహరణల అనంతరం అభ్యర్థులు నేరుగా ఎన్నికల ప్రచారంలోకి దిగిపోలేని పరిస్థితి. పట్టుమని వారం రోజుల్లోనే ఎన్నికల తేదీ వస్తుండటంతో అభ్యర్థులు వార్డు సభ్యుని వద్ద నుంచి సర్పంచ్ అభ్యర్థులంతా సొమ్ముల కోసం పరుగులు పెడుతున్నారు. ఇదే సమయంలో కొందరు పెట్టుబడుదారులకు ఈ ఎన్నికలు సిరులు కురిపిస్తున్నాయి. ఇరువైపుల అభ్యర్థులు లక్షల్లో సొమ్ములు వెచ్చించాల్సిన పరిస్థితి. ఎన్నికల అనంతరం గెలిచిన అభ్యర్థి ఓ రకమైన బాధతో, ఓడిన వ్యక్తి మరో రకమైన బాధతో ఉంటారంటూ కొందరు విశ్లేషిస్తున్నారు.

నారాయణపురం గ్రామాన్ని

ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

కాంగ్రెస్ నాయకుడు పొంగులేటి ప్రసాదరెడ్డి

కల్లూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) కల్లూరు మండలంలోని నారాయణపురం గ్రామ పంచాయతీని ఆదర్శ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి చెప్పారు. కాంగ్రెస్ పార్టీ నారాయణపుం గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా గొల్లమందల వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక్కేరు నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు సర్పంచుగా ఏకగ్రీవంగా ఎన్నిక కానున్నందున ప్రసాద్‌రెడ్డితో పాటుగా గ్రామస్థులు శాలువతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారాయణపురం గ్రామాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి మోడల్ గ్రామ పంచాయితీగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. స్థానికంగా ప్రభుత్వ ఆసుపత్రి, విద్యుత్ సబ్‌స్టేషన్, గ్రామాల్లో డ్రైనేజీ సౌకర్యం మెరుగుపరుస్తామని వివరించారు. ఇప్పటికే ఆయా కార్యాలయాల భవనాల నిర్మాణానికి 30 కుంటల స్థలాన్ని సేకరించటం జరిగిందని, తమ గ్రామంలో గల చెరువు ప్రదేశాన్ని టూరిజం కేంద్రంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. ఏకగ్రీవంగా జరిగిన ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చెందిన గొల్లమందల వెంకట్కేర్లు కాగా ఉప సర్పంచ్ పదవిని వేరే వారికి కేటాయించటం జరిగిందన్నారు.

మేం చేసిన అభివృద్ధే

బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తుంది

పదేళ్లలో రఘునాథపాలేన్ని సుందరంగా తీర్చిదిద్దాం

పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాల్లో మాజీ మంత్రి పువ్వాడ అజయ్



చిమ్మపూడిలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పువ్వాడ

రఘునాథపాలెం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ హయాంలో తాము రఘునాథపాలెం మండలంలో జరిగిన అభివృద్ధే బీఆర్ఎస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను గెలిపిస్తుందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం ఆయన రఘునాథపాలెం మండలంలోని చిమ్మపూడి, పాపటపల్లి గ్రామాల్లో జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ సీఎంగా ఉన్న పదేళ్లు, తాను మంత్రిగా ఉన్న ఐదేళ్లు అభివృద్ధి పరుగులు పెట్టిందని, తాను నిత్యం ప్రజలకు అందుబాటు లో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం పని చేశానన్నారు. బీజేపీ మద్దతుతో బీఆర్ఎస్ చిమ్మపూడి అభ్యర్థిగా పోటీచేస్తున్న గుత్తా రవిని సర్పంచ్‌గా గెలిపించుకుంటే గ్రామం అభివృద్ధి సాధిస్తుందన్నారు. మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, అత్యధిక సర్పంచ్ స్థానాలను గెలుచుకొని బీఆర్ఎస్ ఖాతాలో వేయాలని పిలుపునిచ్చారు. సాయంత్రం మండల పరిధిలోని చింతగుర్తి, గణేశ్వరం, వేపకుంట్ల, వివిపాలెం గ్రామ పంచాయితీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బీరెడ్డి నాగచంద్రారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అజ్మీరా వీరూ నాయక్, ఖమ్మం నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, చిమ్మపూడి, పాపటపల్లి సర్పంచ్ అభ్యర్థులు గుత్తా రవి, కొండపర్తి లక్ష్మీ, బీఆర్ఎస్ నేతలు మాదంశెట్టి హరిప్రసాద్, దొంతు సత్యనారాయణ, గొర్రె శ్రీనివాసరావు, మాజీ సర్పంచులు గొర్రె కృష్ణవేణి, చెరుకూరి ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ఉప సర్పంచ్ పదవి ఉత్తమమైనదే

సర్పంచ్‌తో పాటు చెక్ పవర్.. అక్రమాలను అడ్డుకునే అవకాశం

అశ్వారావుపేట రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో సర్పంచ్, వార్డుసభ్యుల పదవుల కోసం ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఎన్నికల్లో చాలా మంది సర్పంచ్ పదవి కోసం పోటీ పడుతుంటారు. ఇందుకు అధికంగా డబ్బులను ఖర్చు చేస్తున్నారు. అయితే సర్పంచ్ పదవితో పాటు ఉప సర్పంచ్ పదవికి ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. 2018 పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం పంచాయతీ నిధుల వినియోగంలో ఉప సర్పంచికి కూడా జాయింట్ చెక్‌పవర్ అవకాశాన్ని కల్పించారు. దీంతో పంచాయతీల్లో సర్పంచ్‌తో పాటు ఉప సర్పంచ్ కూడా కీలకంగానే ఉంటారు. గ్రామ పంచాయతీ నిధుల వినియోగంలో అక్రమాలకు తావివ్వకుండా అడ్డుకునే అవకాశంఉంది. పంచాయతీలో అభివృద్ధి పనులకు సంబంధించిన, నిధుల వినియోగానికి సంబంధించి సర్పంచ్ సమిష్టిగా నిర్ణయాలు కాకుండా స్వంత నిర్ణయాలతో ముందుకు వెళ్తున్న సమయంలో తన చెక్‌పవర్‌తో అడ్డుకట్ట వేయవచ్చు. వీటితో పాటు పంచాయతీల్లో పలు విషయాల్లోనూ కీలకంగా వ్యవహరించవచ్చు. ఈనేపథ్యంలోనే అనేకమంది రిజర్వేషన్ల కారణంగా సర్పంచ్ పదవికి పోటీచేయలేని స్థితిలో వార్డుసభ్యుడిగా పోటీచేసి ఉప సర్పంచి అయ్యేందుకు ప్రయత్నాలు చేస్తుంటారు.

వరాల జల్లు కురిపించిన స్వతంత్ర అభ్యర్థి

పేరువంచ వాసులకు బాండ్‌పేపర్‌పై హామీలిచ్చిన శ్రీనివాసరావు



కొండపల్లి శ్రీనివాసరావు (వాసు)

కల్లూరు, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి) : స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గెలిపిస్తే తాను చేసే అభివృద్ధి, పలు కార్యక్రమాల వివరాలను బాండ్ పేపర్‌పై రాసిచ్చారు కల్లూరు మండలంలోని పేరువంచ పంచాయతీ సర్పంచ్ స్వతంత్ర అభ్యర్థి కొండపల్లి శ్రీనివాసరావు (వాసు). శుక్రవారం నామినేషన్ వేసిన దాఖలు చేసిన ఆయన 12 అంశాలను బాండ్ పేపర్ ముద్రించి విడుదల చేశారు. సర్పంచ్‌గా తనను గెలిపిస్తే గ్రామప్రజల సంక్షేమానికి ఉపయోగపడేలా పలు అభివృద్ధి కార్యక్రమాలను తన సొంత ఖర్చులతో చేపడతానని పేర్కొన్నారు. ఇల్లిల్లు తిరిగి ఓటర్లను కలుసుకొని ఈ బాండ్ పేపర్ పత్రాలను అందిస్తున్నానని, బాండ్ పేపర్‌లో ఇచ్చిన హామీల ప్రకారం పేదింటి ఆడబిడ్డ పెళ్లికి రూ.25,116, పేదల గృ హప్రవేశానికి రూ.10,116, పేద ఆడబిడ్డ ప్రసవానికి రూ.10,116 ఇవ్వడంతో పాటుగా పురుషులు, మహిళ వ్యవసాయ కార్మికులకు సొంత డబ్బుతో ప్రమాదబీమా చేయిస్తానని, అత్యవసర వైద్య చికిత్స కోసం రూ.5వేల నుంచి రూ.10వేల వరకు సాయం అందిస్తానని హామీ ఇస్తున్నట్టు ప్రక టించారు. పేరువంచ గ్రామంలో మొత్తం 2వేల మంది ఓటర్లుండగా సర్పంచ్ పదవి జనరల్‌కు రిజర్వ్ అయ్యింది.

ఓటొకచోట.. చోటొకచోట..



చుంచుపల్లి మండలంలోని వెంకటేష్ ఖని గ్రామ పంచాయతీ కార్యాలయం ఇదే..



వెంకటేష్ ఖని పంచాయతీలో నిర్మానుష్యంగా ఉన్న ప్రాంతం

పంచాయతీ ప్రాంతం లేదు... కానీ ఎన్నికలు!

ఓటు ఉన్నది గ్రామ పంచాయతీ పరిధిలో..

నివసించేది కార్పొరేషన్ ప్రాంతంలో...

చుంచుపల్లి మండలంలో అరుదైన సంఘటన

చుంచుపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): చుంచుపల్లి మండలంలో గ్రామ పంచాయతీ ప్రాంతం లేదు కానీ... ఆ పంచాయతీలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసి నామినేషన్లు స్వీకరించారు. మండలంలో సింగరేణి ప్రభావిత ప్రాంతంలో సుమారు 30 ఏళ్ళ క్రితం చిన్న గ్రామంగా ఏర్పడిన వెంకటేష్ ఖని దినదినాభివృద్ధి చెంది గ్రామ పంచాయతీగా ఆవిర్భవించింది. ఎస్టీ రిజర్వేషన్ ఉన్నఈ గ్రామ పంచాయతీలో గతంలో ఎస్టీ మహిళ సర్పంచ్‌లు కొంత మంది పని చేశారు. పీవీకే - 5 ఓసి విస్తరణలో భాగంగా కొత్తగూడెం సింగరేణి ఏరియా పరిధిలో ఏర్పాటు చేస్తున్న పనులు ప్రారంభమైన వీకేవోసి కోల్ మైన్ (ఓపెన్ కాస్ట్) కారణంగా పూర్తిగా ఖాళీ అయింది. దీంతో 2022 ఏడాదిలో వెంకటేష్ ఖని గ్రామ పంచాయతీలో నివసిస్తున్న వారికి భూనిర్వాసితుల కింద 79 మందికి కొత్తగూడెం మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని గంగాబిషన్ బస్తీలో బిపిఎల్ కోటాలో ఇంటి పట్టాలను పంపిణీ చేసి స్థలాన్ని అందించారు. ప్రస్తుతం వెంకటేష్ ఖని పంచాయతీలో 183 మంది ఓటర్లు ఉండగా, నాలుగు వార్డులు ఉన్నాయి. ఈ ప్రాంతంలో నివాసాలు నేలమట్టం చేయడంతో నిర్మానుషంగా మారిన ఈ పంచాయతీ ప్రాంతంలో ఎన్నికలు ఏ విధంగా నిర్వహిస్తారనేది సందిగ్ధంగా మారింది.

ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం

సింగరేణి ప్రభావిత ప్రాంతంలో ఉన్న వెంకటేష్ ఖని పంచాయతీలో ఈ నెల 14న పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. ఓటు ఉన్నది గ్రామ పంచాయతీలో నివసించేది మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో ఈ పంచాయతీ ఓటర్లు ఉండడం గమనార్హం. ఈ పంచాయతీలో సర్పంచ్‌కు- 4, వార్డుకు-10 మంది నామినేషన్లను దాఖలు చేయగా అధికారులు స్వీకరించారు. శనివారం దరఖాస్తుల గడువు ఉండడంతో బరిలో ఎవరు ఉంటారనేది తేలనుంది. వెంకటేష్ ఖని పంచాయతీ ఎన్నికల నిర్వహణ ఏ విధంగా ఉంటుందని చర్చాంశానియంగా మారింది.

'జోలెపట్టి' నామినేషన్ వేసి..

ఇంటింటికీ తిరిగి చందాలు వసూలు చేసిన మహిళా సర్పంచ్ అభ్యర్థి



కాకర్లలో చందాలు వసూలు చేస్తున్న మహిళా సర్పంచ్ అభ్యర్థి బాణోత్ బద్రి

జూలూరుపాడు, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల్లో అభ్యర్థులను ఏకగ్రీవం చేసేందుకు పలు రాజకీయ పార్టీల నాయకులు రూ.లక్షలు వెచ్చిస్తున్నారు. కాగా జూలూరుపాడు మండలంలోని కాకర్ల పంచాయతీలో మాత్రం అందుకు భిన్నంగా ఓ మహిళా సర్పంచ్ అభ్యర్థి నామినేషన్ వేసేందుకు దారవత్ రుసుం చెల్లించడానికి గాను తన భర్త శ్రీనుతో కలసి ఇంటింటికీ తిరిగి జోలెపట్టి చందాలను సేకరించింది. కాకర్ల గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానం ఎస్టీ మహిళకు కేటాయించారు. దీంతో మండలంలోని దుబ్బతండా గ్రామానికి చెందిన బాణోత్ బద్రి కాంగ్రెస్‌లోని ఓ వర్గం నాయకుల మద్దతుతో సర్పంచ్ అభ్యర్థిగా ఎన్నికల బరిలోకి దిగే క్రమంలో శుక్రవారం జోలె పట్టి కాకర్ల గ్రామంలో గడపగడపకూ తిరిగి నామినేషన్ వేయడానికి అవసరమైన సొమ్మును సేకరించింది. ఇలా గ్రామంలో చందాలు వసూలు చేయగా రూ.3వేలు వచ్చినట్లు తెలిపారు. చందా ద్వారా వచ్చిన డబ్బులతోనే రుసుంను చెల్లించి నామినేషన్ దాఖలు చేసినట్లు తెలిపింది. 2019లో జరిగిన ఎన్నికల్లో ఆమె బీఆర్ఎస్ పార్టీ మద్దతుతో ఇక్కడ సర్పంచ్‌గా పోటీ చేసి ఓటమి చవిచూశారు. కాగా మరోసారి తన అదృష్టాన్ని పరిశీలించుకోవడానికి ప్రస్తుతం జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీలోని ఓ వర్గం నాయకుల మద్దతును కూడగట్టుకుని సర్పంచ్ అభ్యర్థిగా బరిలో నిలిచారు.

సీపీఐ సర్పంచ్ అభ్యర్థిపై కాంగ్రెస్ నేతల దౌర్జన్యం

నామినేషన్ పత్రాల అపహరణ



మాట్లాడుతున్న సర్పంచ్ అభ్యర్థి పూణెం కోటయ్య, సీపీఐ నేతలు

ఇల్లెందు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇల్లెందు మండలం సుభాశ్‌నగర్ గ్రామపంచాయతీలో సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేయొద్దని బెదిరిస్తూ కాంగ్రెస్ నాయకులు తన నామినేషన్ పత్రాలు గుంజుకొని తీసుకెళ్లారని సర్పంచ్ అభ్యర్థి పూణెం కోటయ్య ఆవేదన వ్యక్తం చేశారు. నామినేషన్ స్వీకరణ కేంద్రంలో వేచి ఉన్న తమ పార్టీ సర్పంచ్ అభ్యర్థి కోటయ్య నామినేషన్ పత్రాలను కాంగ్రెస్ నాయకులు దౌర్జన్యం చేసి తీసుకెళ్లడం అప్రజాస్వామికమని సీపీఐ రాష్ట్ర నాయకులు కె.సారయ్య ఆరోపించారు. నామినేషన్ కేంద్రం వద్ద అభ్యర్థి పూణెం కోటయ్య, సీపీఐ నేత కె.సారయ్య విలేకరులతో మాట్లాడుతూ నామినేషన్ దాఖలు చేసేందుకు శుక్రవారం మధ్యాహ్నం నుంచి సుభాశ్‌నగర్ గ్రామపంచాయతీ కేంద్రంలో వేచిఉన్న కోటయ్య వద్దకు కాంగ్రెస్ నాయకులు వచ్చి నామినేషన్ వేయొద్దంటూ బయటకు గుంజుకొచ్చారని చేతిలో ఉన్న నామినేషన్ పత్రాలను ఒరిజినల్ పత్రాలను లాక్కొని పోయారని తెలిపారు. తనపై దౌర్జన్యం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఎన్నికల కమిషన్ తగిన చర్యలు తీసుకోవాలని కోటయ్య డిమాండ్ చేశారు. ప్రజాపాలన పేరుతో అధికార పార్టీ నాయకులు సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆదివాసీ గిరిజనుడిపై దౌర్జన్యం చేయడం సరైంది కాదని ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకొని సుభాశ్‌నగర్ గ్రామ పంచాయతీ ఎన్నికలను నిలిపివేయాలని కోరారు.

ఓటు అమ్ముకుంటే మనల్ని మనం అమ్ముకున్నట్లే!

మంచి చేస్తారనుకున్న వారికి ఓటు వేయండి

ఫ్లెక్సీ ఏర్పాటుచేసిన స్వతంత్ర అభ్యర్థి

పూనెం ప్రదీప్‌కుమార్



భద్రాచలం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఓటు అమ్ముకుంటే మనల్ని మనం అమ్ముకున్నట్లే.. మీకు మంచి చేస్తారనుకున్న వారికి ఓటు వేయండని భద్రాచలంలోని అంబేద్కర్ సెంటర్ లో సర్పంచ్ పదవికి పోటీ చేస్తున్న స్వతంత్ర అభ్యర్థి పూనెం ప్రదీప్ కుమార్ ఓటర్లను కోరారు. మీ ఓటు విలువ రూ.వెయ్యి లకు అమ్ముకుంటే.. మీ విలువెంతో తెలుసుకోండి రోజుకు 0.548 పైసలు అని ఆ ఫ్లెక్సీలో పేర్కొన్నారు. అందుకని ఒకసారి ఆలోచించి మీరువెలకట్టలేని మీ ఓటు విలువ ఈ సమాజాన్ని చిన్నాభిన్నం చేసేదిగా ఉండకూడదు. మన బిడ్డల భవిష్యత్తును సమా జ శ్రేయస్సును కాపాడేలా ఉండాలని అందులో పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాల్లో సైతం ఈ ఫ్లెక్సీ విస్తృతంగా ప్రచారంలో ఉంది. ఓటర్లను భద్రాద్రి వాసులను ఎంతగానో ఆలోచింపజేస్తోంది.

● ఎన్నికల బరిలో మాజీ ఎమ్మెల్యే కట్టా కోడలు



కట్టా కుటుంబం నుంచి సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న ధనమ్మ

కల్లూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కల్లూరు మండంలోని పోచవరం గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా మధిర దివంగత మాజీ ఎమ్మెల్యే కట్టా వెంకటనరసయ్య కోడలు కట్టా ధనమ్మ గురువారం తమ అనుచరగణంతో నామినేషన్ కేంద్రానికి తరలివచ్చి అట్టహాసంగా నామినేషన్ వేశారు. ఈ ఎన్నికల రణరంగంలో మాజీ ఎమ్మెలే కట్టా కుటుంబం నుంచి కోడలు ధనమ్మ సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేయటంతో మరోసారి రాజకీయంగా తెరపైకి వచ్చారు. మండలంలోని పోచవరం గ్రామానికి చెందిన వెంకటనరసయ్య గతంలో రెండుసార్లు మధిర నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు. అదే కుటుంబం నుంచి ఆయన తనయుడు కట్టా అజయ్‌కుమార్ కల్లూరు జడ్పీటీసీగా, పోచవరం సొసైటీ అధ్యక్షుడిగా పదివీ బాధ్యతలు నిర్వర్తిస్తూ రాజకీయంగా మంచి గుర్తింపు పొందారు. తాజాగా మరోమారు అజయ్‌కుమార్ సతీమణి ధనమ్మ సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేయడం రాజకీయంగా చర్చనీయంశంగా మారింది. గతంలో పోచవరం గ్రామ పంచాయతీ ఎస్సీ రిజర్వుడు కాగా కట్టా కుటుంబం చొరవతో వారి తరుపున సర్పంచ్‌గా నంద్రు అన్నపూర్ణ ఎన్నికైన విషయం విదితమే.

● కొంగర బరిలో అక్కాచెల్లెలు

సర్పంచ్‌గా పోటీపడుతున్న తోబుట్టువులు

నేలకొండపల్లి మండలంలో ఆసక్తికరం





మన్నెంపూడి కృష్ణకుమారి, చిట్టూరి రంగమ్మ

నేలకొండపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాజకీయాల్లో బంధాలు, బంధుత్వాలు అడ్డురావని నిరూపించారు ఈ అక్కాచెల్లెలు. వారిద్దరూ సర్పంచ్ పదవికి సై అంటూ పోటీపడడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ ఆసక్తికర పోరుకు వేదికైంది ఖమ్మం జిల్లా నేలకొండపల్లి కొంగర గ్రామం. ఈ గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవికి సొంత అక్కచెల్లెలు పోటీ పడుతుండటంతో ఎవరు గెలుస్తారనే దానిపైనే ప్రస్తుతం గ్రామంలో ఆసక్తికర చర్చ జరుగుతోంది. మొత్తం 402 ఓట్లున్న ఈ గ్రామం జనరల్‌కు రిజర్వ్ అయ్యింది. కాంగ్రెస్ అభ్యర్థిగా చెల్లి చిట్టూరి రంగమ్మ పోటీ చేస్తుండగా, కాంగ్రెసేతర పార్టీల మద్దతుతో అక్క మన్నెంపూడి కృష్ణకుమారి పోటీ చేస్తోంది. అయితే ఇతర పార్టీల మద్దతుతో పోటీ చేస్తున్న ఆమె.. తాను కూడా కాంగ్రెస్ పార్టీయేనని చెప్పుకోవటం గమనార్హం. నామినేషన్ల ఉపసంహరణకు ఇరువురూ ససేమిరా అనడం మరింత ఉత్కంఠను పెంచుతోంది. ఇక ఇదే మండలంలోని అప్పల నర్సింహాపురం పంచాయతీ సర్పంచ్ పదవికి పిన్ని బండారు సుభాషిణి, కూతురు మన్నె రాజశ్రీ పోటీ పడుతున్నారు. దీంతో ఈ గ్రామంలోనూ ఉత్కంఠ వాతావరణం నెలకుంది.

● ముసలిమడుగులో అన్నాదమ్ముల మధ్యే పోటీ





తడికమళ్ల నాగేశ్వరరావు, నాగార్జున

వైరా, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముసలిమడుగు గ్రామపంచాయతీ సర్పంచ్ పదవికి సొంత అన్నదమ్ములు పోటీ పడుతున్నారు. కాంగ్రెస్‌కే చెందిన అన్నదమ్ములు మాత్రమే బుధవారం నామినేషన్ల ఉపసంహరణ తర్వాత బరిలో మిగిలారు. సొంత అన్నదమ్ములైన ముసలిమడుగు మాజీ ఎంపీటీసీ తడికమళ్ల నాగేశ్వరరావు, తడికమళ్ల నాగార్జున ముఖాముఖీ తలపడుతుండటంతో ఈ ఎన్నిక రసవత్తరంగా మారింది. ముసలిమడుగు సర్పంచ్ ఎన్నికను ఏకగ్రీవం చేసేందుకు చివరి నిమిషం వరకు కాంగ్రెస్ నాయకులు తీవ్ర ప్రయత్నాలు చేశారు. ఒక దశలో ఏకగ్రీవ ఎన్నికకు మార్గం సుగమం అయిందని కూడా భావించారు. చివరికి అది కాస్తా బెడిసికొట్టింది. దాంతో అన్నదమ్ములు నాగేశ్వరరావు, నాగార్జునలు సర్పంచ్ బరిలో తలపడుతున్నారు.

● జిల్లా నుంచి.. గ్రామస్థాయికి

సర్పంచ్‌గా మాజీ ఎంపీపీ.. వార్డు మెంబరుగా మాజీ జడ్పీటీసీ



సర్పంచ్‌గా పోటీ చేస్తున్న మాజీ ఎంపీపీ బాబు



వార్డు మెంబర్‌గా పోటీ చేస్తున్న మాజీ జడ్పీటీసీ వెంకటరెడ్డి

చండ్రుగొండ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మండల, జిల్లాస్థాయిలో గుర్తింపు పొందిన ఇద్దరు నాయకులు నేడు ఒకరు సర్పంచ్‌గా మరొకరు వార్డు మెంబరుగా పోటీ చేయటం సర్వత్రా చర్చనీయంగా మారింది. ఇక వివరాల్లోకి పోతే మండలంలోని పోకలగూడెం గ్రామానికి చెందిన గుగులోత్ బాబు కాంగ్రెస్ పార్టీ నుంచి 2006 నుంచి 2011 వరకు ఎంపీపీగా ఉన్నారు. అంతకు ముందు 2004 నుంచి 2006 వరకు బాబు సతీమణి మీనా సైతం ఎంపీపీగా చేశారు. అయితే ఎంపీపీగా చేసిన బాబు తిరిగి ఈ ఎన్నికల్లో పోకలగూడెం సర్పంచ్ అభ్యర్థిగా పోటీకి దిగారు. ఇదిలా ఉండగా చండ్రుగొండకు చెందిన కొనకండ్ల వెంకటరెడ్డి కాంగ్రెస్ పార్టీ తరుపున 2019 ఎన్నికల్లో చండ్రుగొండ జడ్పీటీసీగా ఎన్నికై 2024 వరకు ఆ పదవిలో కొనసాగారు. దీంతో పాటు గతంలో జిల్లా ప్లానింగ్ బోర్డు సభ్యుడిగా, సుదీర్ఘకాలం మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేసిన ఆయన ప్రస్తుత ఎన్నికల్లో చండ్రుగొండ పంచాయతీలో మూడవ వార్డు నుంచి పోటీ చేస్తున్నారు. వీరి గ్రామాల్లో రాజకీయంగా పట్టు నిలుపుకొనేందుకే ఇద్దరూ జిల్లా, మండలస్థాయి నుంచి సాధారణ స్థాయి పదవుల్లో పోటీకి దిగినట్లు ప్రచారం జరుగుతుంది.

● పంచాయతీ వార్డు బరిలో భార్యాభర్తలు



నామినేషన్ అందిస్తున్న భార్యభర్తలు అర్వపల్లి ఉపేందర్, రేణుక

కూసుమంచి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కూసుమంచి గ్రామ పంచాయతీ ఎన్నికల బరిలో భార్యభర్తలు ఇరువురు వార్డు మెంబర్లుగా పోటీలో ఉన్నారు. బీసీ జనరల్ రిజర్వేషన్ అయిన 12వార్డు నుంచి అర్వపల్లి ఉపేందర్, 4వ వార్డు జనరల్ మహిళకు రిజర్వేషన్ కాగా ఈ వార్డు నుంచి అతని భార్య అర్వపల్లి రేణుక బరిలో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులుగా ఎన్నికల్లో తమ అదృష్టాన్ని పరిక్షించుకోనున్నారు.

● వేర్వేరు సర్పంచ్ అభ్యర్థులకు మద్దతుగా నిలిచిన దంపతులు



వేర్వేరు అభ్యర్థులకు మద్దతు ఇచ్చిన దంపతులు ఉష, వినోద్

పెనుబల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రెండు పార్టీల సర్పంచ్ అభ్యర్థులకు ఓ భార్యాభర్తలు మద్దతుగా నిలిచిన విచిత్ర సం ఘటన ఇది. పెనుబల్లి మండలం సూరయ్య బంజర్ గ్రామపంచాయతీలో కాంగ్రెస్ రెబల్స్‌గా పోటీ చేస్తున్న వీరన్న, సూర్యలకు మద్దతుగా ఓ భార్యాభర్తలు వార్డు సభ్యులుగా నామినేషన్లు వేశారు. వీరన్న ప్యానెల్ నుంచి ఒకటో వార్డు ఎస్టీ మహిళకు కేటాయించగా వాంకుడోతు ఉష, సూర్య ప్యానెల్ నుంచి ఆరో వార్డు ఎస్టీ జనరల్‌కు కేటాయించగా వాంకుడోతు వినోద్ నామినేషన్ వేశారు. ఈ దంపతులు వాంకుడు ఉష, వాంకుడోతు వినోద్‌లు వీరన్న, సూర్య ప్యానెళ్లకు మద్దతుగా నిలవడం చర్చనీయాంశమైంది.

సూపర్ ఫాస్ట్ రైళ్లకు హాల్ట్ కల్పించాలి

రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కి ఎంపీ వద్దిరాజు వినతి

ఖమ్మంమార్కెట్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): వర్తక, వ్యాపార కేంద్రంగా ప్రసిద్ధి చెందిన ఖమ్మం నగరానికి సూపర్ ఫాస్ట్ రైళ్లకు హాల్ట్ కల్పించాలని కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కి రాజ్యసభ ఎంపీ, బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర శుక్రవారం ఢిల్లీలో వినతిపత్రం అందించారు. కోవిడ్ సమయంలో రద్దు చేసిన పలు ప్యాసింజర్ సర్వీసులను పునరుద్ధరించాలని,ఢిల్లీ, బిహార్, రాజస్థాన్ వైపు వెళ్లే ప్రయాణికులకు సౌలభ్యంగా గయామాస్, స్వర్ణజయంతి, జైపూర్ ఎక్స్‌ప్రెస్‌లను ఖమ్మంలో నిలపాలని వద్దిరాజు రవిచంద్ర విజ్ఞప్తి చేశారు.

గ్రామాభివృద్ధికి హరియాతండా వాసుల అడుగులు

11న జరిగే ఎన్నికల్లో సర్పంచ్ కాంగ్రెస్‌కు, ఉపసర్పంచ్ బీఆర్ఎస్‌కు ఓట్లు వేయాలని నిర్ణయం




స్థానిక నాయకులతో సైదుబాబు, రాపర్తి శరత్,శ్రీను, రవిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న మేయర్ నీరజ, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు దీపక్ చౌదరి

రఘునాథపాలెం, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హరియా తండా పంచాయతీలో స్థానిక నేతలు ఏకగ్రీవానికి అడుగులు వేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ ఉమ్మడి పార్టీల అభ్యర్థులుగా కలిసి కాంగ్రెస్ నుంచి సర్పంచు, బీఆర్ఎస్‌నుంచి ఉపసర్పంచ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు ఓటర్లు శుక్రవారం నిర్ణయించుకున్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభివృద్ధి దిశగా గ్రామాన్ని తీసుకెళ్తారనే నమ్మకంతో పార్టీలకు అతీతంగా ఎన్నికలో సర్పంచ్ పదవికి కాంగ్రెస్ పార్టీకి, ఉప సర్పంచ్‌కు బీఆర్ఎస్ అభ్యర్థికి ఓట్లు వేయాలని నిర్ణయించుకున్నట్లు నాయకులుతెలిపారు. కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా బానోత్ స్వాతి, బీఆర్ఎస్ నుంచి ఉపసర్పంచ్‌గా మాలోత్ నాగేశ్వరరావును ఓట్లు వేసి గెలిపించుకుంటామని స్థానిక నాయకులు తెలిపారు. ఈసమావేశంలో వీవీపాలెం సొసైటీ ఛైర్మన్ రావూరి సైదుబాబు, ఏలూరు శ్రీనివాసరావు, చంద్ర రాంబాబు, ఇన్‌చార్జ్ కార్పొరేటర్ రాపర్తి శరత్, గ్రామనాయకులు మంగిలాల్, రమేష్‌శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థులు

రఘునాథపాలెం మండంలోని 37 గ్రామపంచాయితీల్లో సర్పంచ్‌లుగా పోటీలలో ఉన్న కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థులు.వీరిలో ఐదుగురు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పుటానితండ పంచాయితీ కాంగ్రెస్ పార్టీసర్పంచ్ అభ్యర్థిగా మూడ్‌చిన్నా, బద్యాతండా బానోత్‌కోటేష్‌నాయక్,రాంక్యాతండతేజావత్ వెంకన్న, సూర్యాతండ బానోత్ సక్రీయ, హర్యాతండ బానోత్ స్వాతి, పాపాటపల్లి ఉయ్యూరు ద్రాక్షవతి, వీఆర్ బంజర భూక్యా రమణ, జీకె బంజర బానోత్ భీమా నాయక్, చిమ్మపుడి కోటేరు నర్సిరెడ్డి, కోటపాడు కొంటెముక్కల నాగేశ్వరరావు,కోయచెలకబలుసుపాటి శేషయ్య, మంచుకుండ వాన్‌కోండోత్ దీప్లా నాయక్, శివాయిగుడెం భక్యా కాంతమ్మ, పువ్వాడ ఉదయ్‌నగర్ షేక్ శిద్దిఖీ, బూడిందెంపాడు కూరపాటి విజయ్‌కుమార్, వి వెంకటాయపాలెం కాపా ఆదినారాయణ, చింతగుర్తి తమ్మిని ప్రియాంక, గణేశ్వరం భూక్యా నాగేశ్వరరావు, పరికలబోడు తండ తేజావత్ గోపి, జింకలతండ ధరావత్ సుగుణ, బావోజీతండ ధరావత్ మంగ్లీ, చెరువు కొమ్ముతండ భూక్యా భాషా, వేపకుంట్ల చల్లగుండ్ల శ్రీవిద్య, పంగిడి భూక్యా స్వాతి, ఎన్‌వి బంజర బానోత్ సునిత, రజబ్‌అలీనగర్ బానోత్ ధరణి, కెవి బంజర అజ్మీరా రమణి, మూలగుడెం జర్పుల స్వాతి, ఈర్లపుడి కేలోత్ గీతా, కొర్లపాడు తండ భూక్యా చిన్నయ్య, దొనబండ తేజావత్ నవీన్, లచ్చిరాం తండ మాలోత్ జ్యోతిశ్రీ బరిలో ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీలోకి బీఆర్ఎస్ ఉప సర్పంచ్

మండల పరిధిలోని బావోజీతండకు చెందిన బీఆర్ఎస్ పార్టీ ఉపసర్పంచ్ అభ్యర్థి భూక్యా రవి శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. మేయర్ పునుకుల్ల నీరజ, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు దీపక్‌చౌదరి సమక్షంలో రవి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనకు కాంగ్రెస్ పార్టీ జెండను మెడలోవేసి పార్టీలోకి ఆహ్వానించారు. రవి మాట్లాడుతూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేస్తున్న అభివృద్ధి పనులను చూసి తాను కూడా అభివృద్ధి పనుల్లో భాగస్వామ్యం కావాలని కాంగ్రెస్‌లో ఏరామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామకాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ గజ్జల వెంకన్న,నాయకులు ధరావత్ రామకోటి, సుధాకర్, నవీన్, గుగులోత్ బిచ్చా, ఆంగోత్ సైదులు, రమేష్, రవి, వీరభద్రం, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

సైనికుల కుటుంబాలను ఆదుకోవాలి

- సైనిక సంక్షేమానికి అందించే సాయం ఎప్పటికీ మరువలేనిది
- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



సైనిక అమరవీరుల కుటుంబాలకు సహాయం అందిస్తున్న కలెక్టర్

ఖమ్మంకలెక్టరేట్,డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): సైనికఅమరవీరుల కుటుంబాలను ఆదుకోవడం మనందరి నైతిక బాధ్యత అని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. దేశరక్షణలో ప్రాణత్యాగం చేసిన సైనికుల కుటుంబాల సంక్షేమం కోసం సేకరించే సాయుధ దళాల పతాక దినోత్సవం నిధికి శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో, కలెక్టర్, దేశభక్తి చిహ్నమైన రిబ్బన్ ఫ్లాగ్‌ను స్వీకరించి విరాళాన్ని అందజేశారు. సరిహద్దుల్లో విధులు నిర్వర్తిస్తూ ప్రాణత్యాగం చేస్తున్న సైనికుల కుటుంబాల సంక్షేమం కోసం నిర్వహించే ఫ్లాగ్‌డేఫండ్ సేకరణకు ప్రజలు సహకరించాలన్నారు. సైనికులు దేశంకోసం ప్రాణాలను అర్పించినప్పుడు, వారికుటుంబాలు కష్టాల్లో పడకుండా చూడటం ప్రతీ పౌరుడి కర్తవ్యమన్నారు.సామర్థ్యాన్ని బట్టి ఎంతైనా ఈనిధికి అందించాలని కోరారు. సాయుధ దళాల పతాకదినోత్సవం నిధి పూర్తిగా అమరవీరుల కుటుంబాలు, విధి నిర్వహణలో గాయపడ్డ జవాన్లు, వికలాంగులైన రిటైర్డ్ సైనికులు, వృద్ధ సైనికుల సంక్షేమ కార్యక్రమాలకు వినియోగించబడతాయని తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి యం. చంద్రశేఖర్, ఈసీహెచ్ఎస్ ఓఐసీవింగ్ కమాండర్ సురేంద్ర, ఎస్. అనూష, కళావాసు, వీరబాబు, సాయికుమార్ మాజీసైనిక సంక్షేమ సంఘ అధ్యక్షుడు సుభాని, కృష్ణమూర్తి, మాజీసైనికులుగోపాలరావు, ఎస్‌యం అరుణ్, హనుమంతరావు,అనిల్ కుమార్ పాల్గొన్నారు.

అంధుల పాఠశాలను పూర్తి చేయాలి

ఖమ్మంఖానాపురంహవేలి: శుక్రవారం జడ్పీ సెంటర్‌లోని నిజాంపేట్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక అంధుల పాఠశాల నిర్మాణ పనులను కలెక్టర్ అనుదీప్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిర్మాణ పనులను పరిశీలించి భవన నిర్మాణ నాణ్యత, ప్రహరీ గేట్, ప్రవేశ మార్గాలు, అంతర్గత గదుల రూపకల్పన, ఆర్కిటెక్చర్ ఆకృతిని విషయ నిర్ధారణతో మానిటర్ చేశారు. తరగతి గదులు,నైపుణ్యాభివృద్ధి కోసం ఏర్పాట్లు, మ్యూజికల్ పార్క్, సదుపాయాల నమూనా మ్యాప్‌లు, డిజైన్ ఫోటోలను పరిశీలించి కలెక్టర్‌పలుసూచనలు చేశారు. అంధులు పాఠశాలలో ప్రవేశించిన క్షణం నుంచి బయటికి వెళ్లే వరకు పూర్తిస్థాయి భద్రత, సౌలభ్యం లభించేలా నిర్మాణంలో ప్రతిదీ ఖచ్చితత్వంలో ఉండాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జడ్పీ సీఈఓ దీక్షా రైనా, పంచాయతీరాజ్ ఈఈ మహేష్ బాబు, ఏఈ చిరంజీవి, సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలు సహకరించాలి: ఏసీపీ

తిరుమలాయపాలెం, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల్లో ప్రశాంతగా నిర్వహించేందుకు అన్ని రాజకీయపార్టీల నాయకులు సహకరించాలని రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని జల్లేపల్లిలో ఎన్నికల నిర్వాహణపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీఐ సంజీవ్, ఎస్ఐ కూసుపుడి జగదీష్, అదనపు ఎస్ఐ రామలింగారెడ్డి, సిబ్బంది వీరస్వామి, ప్రసాద్, వెంకటేశ్వర్లు, రామ్మూర్తి,నాయకులు పోట్ల కిరణ్, వీరన్న పాల్గొన్నారు.

నేడు అంబేద్కర్ వర్ధంతి

ఖమ్మంచర్చికాంపౌండ్, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేద్కర్ వర్ధతి సభ శనివారం నగరంలోని లంబాడీ హక్కుల పోరాట సమితి కార్యాలయంలో నిర్వహిస్తున్నట్టు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బానోతు బద్రు నాయక్ శుక్రవారం ఒకప్రకటనలో తెలిపారు. కుల,ప్రజాసంఘాల నాయకులు విజయవంతం చేయాలని కోరారు.

పెన్షనర్ల ఉచిత సేవా కేంద్రం ప్రారంభం

ఖమ్మంచర్చికాంపౌండ్, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల జీవనప్రమాణ పత్రాలను ఆన్‌లైన్‌లో పంపించే ప్రక్రియను ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాలలో ప్రారంభించారు. ఈకార్యక్రమంలో రాయల వెంకటనారాయణ, దొడ్డ రమేష్,బానోత్ వెంకటేశ్వర్లు, శంకర్,మల్లెల శంకరరావు, డీకేశర్మ పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ఖమ్మంఖానాపురంహవేలి, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): నగరంలోని అన్నం ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఓ అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. బోనకల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని (75) వృద్ధుడు ఇటీవల మృతిచెందాడు. ఆ మృతదేహాన్ని పోలీసులు ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి మార్చురీలో భద్రపరిచారు. మృతదేహం కోసం ఎవరు రానందున, పోలీసులు సూచనల మేరకు బల్లేపల్లి వైకుంఠధామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఖమ్మంఅర్బన్, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): 28వడివిజన్‌లోని ప్రకాష్ నగర్, కుమ్మరిబజార్‌లో ఇద్దరికి సీఎంఆర్ఎఫ్ చెక్కుల కార్పొరేటర్ గజ్జెల లక్ష్మీవెంకన్న శుక్రవారం పంపిణీ చేశారు.మంత్రి తుమ్మల సిఫారసు మేరకు అనారోగ్య బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు మంజూరు చేయించారన్నారు. కార్యక్రమంలో నాయకులు సముద్రాల శ్రీనివాస్, జెట్టి లింగరాజు, అంకాల వీరభద్రం, మహమ్మద్ జహీర్ పాల్గొన్నారు.

పాతబస్టాండ్‌లో దొంగల హల్‌చల్

ఖమ్మంఖానాపురంహవేలి, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): పాతబస్టాండ్‌లో శుక్రవారంరాత్రి సుమారు పదిమంది ప్రయాణికులు సెల్‌ఫోన్లు చోరీ జరిగింది. రద్దీగా ఉన్న బస్సులు ప్రయాణికులు ఎక్కుతుండగా సెల్‌ఫోన్లు తస్కరించారు. దొంగలు. బస్టాండ్ ఆవరణలో పోలీసుల నిఘా లేకపోవటం, ఉన్న సీసీకెమెరాలు సరిగా పనిచేయకపోవటంతో వారి సులువైపోతుందని తెలుస్తుంది. గ్రామీణ ప్రయాణికుల విద్యార్థులు అధికంగా ఈ బస్టాండ్ నుంచి ప్రయానాలు సాగిస్తుంటారు. ఇకనైనా బస్టాండ్ ఆవరణలో పోలీసుల నిఘా తోపాటు సీసీ కెమెరాలు పనిచేసేవిధంగా చూడాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు. రత్నాకర్‌రెడ్డి, చంద్రమౌళి, క్రాంతి కుమార్, వెంకటేశ్వరావు బస్సు ఎక్కుతుండగా దొంగలు వారి ఫోన్లు చోరీ చేశారు.

కారు ఢీ: వ్యక్తి మృతి

ఖమ్మంక్రైం,డిసెంబరు5(ఆంధ్రజ్యోతి):చెట్టు కింద కూర్చున్న వ్యక్తిని ఓ కారు వేగంగా వచ్చి ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం ఖమ్మం నగరంలో జరిగింది. టూ టౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. నగరంలోని మామిల్లగూడెం మొండిగేటు ప్రాతంలో నివసించే భువనగిరి శ్రీను(40) శుక్రవారం మధ్యాహ్నం సమయంలో ఇంటి నుంచి కూరగాయల మార్కెట్‌కు బయలుదేరాడు. వెళ్లేదారిలో కాలునొప్పిగా ఉందని ఓ చెట్టు కింద కూర్చున్నాడు. ఈక్రమంలో కారు అతివేగంగా వచ్చి ఢీ కొట్టింది. దీంతో స్థానికులు కారును ఆపేందుకు ప్రయత్నించిన కారు ఆపకుండా డ్రైవర్ వెళ్లిపోయాడు. తీవ్రంగా గాయపడిన శ్రీనును స్థానికులు ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు వెల్లడించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

భలేమంచిరోజు ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

ఖమ్మంఖానాపురంహవేలి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): సుధాస్ ఎంటర్టైన్మెంట్ ఆధ్వర్యంలో ఏటా స్వర్గీయ ఘంటసాల వెంకటేశ్వర రావు జయంతిని పురస్కరించుకొని నిర్వహిస్తున్న భలేమంచి రోజు కార్యక్రమం ఈనెల7న ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో నిర్వాహిస్తున్నట్లు ఆసంస్థ బాధ్యులు డాక్టర్ టీ. వాసుదేవ్, శరగోపం సుదర్శన్, వినీలా సుదర్శన్, ఎస్‌వి రమణ తెలిపారు. శుక్రవారం ఖమ్మంలో ఈకార్యక్రమానికి సంబంధించి ఆహ్వాన పత్రిక ఆవిష్కరించారు ఈసందర్భంగా మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో వరుసగా క్రమం తప్పకుండా చేస్తున్న 29వ కార్యక్రమం అన్నారు. ఈ కార్యక్రమం ఏ ఏటి కాఏడు సంగిత భరీతంగా జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరవుతున్నట్లు తెలిపారు.

ప్లాస్టిక్ రహిత నగరానికి సహకరించాలి

- పూనే, ఇండోర్ స్ఫూర్తిని కొనసాగించాలి
- మేయర్ పునుకొల్లు నీరజ
- ఛాంబర్ ఆఫ్‌కామర్స్ వ్యాపారులతో సమావేశం



మాట్లాడుతున్న మేయర్ పునుకొల్లు నీరజ

ఖమ్మం కార్పొరేషన్, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లో జాతీయ,రాష్ట్ర స్థాయిలో ఖ్యాతీ పొందుతున్న నగరం ప్లాస్టిక్ రహితంగా పర్యావరణ హితంగా మారేందుకు ఖమ్మం నగరంలోని ప్రతీఒక్కరూ సహకరించాలని, ప్లాస్టిక్ నియంత్రలో ఛాంబర్ ఆఫ్ కామర్స్, వ్యాపారులు కీలకంగా బాధ్యతలు నిర్వహించాలని మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. శుక్రవారం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో గాంధీ చౌక్‌లోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఇతర వ్యాపారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్లాస్టిక్ కవర్లు అమ్మకాలు, వినియోగంపై పర్యావరణానికి హాని అంశాలపై వ్యాపారులకు అవగాహన కల్పించారు. 2019లో ప్లాస్టిక్‌ఫ్రీ ఖమ్మంగా మారిందని తర్వాత 2022, 2023లో ప్లాస్టిక్‌పై యద్ధం ప్రకటించి ప్లాస్టిక్ రహితంగా ఖమ్మాన్ని గుర్తింపు తెచ్చామన్నారు. పూణె, ఇండోర్ స్ఫూర్తితో ఎంతో చైతన్యవంతమైన ప్రజలు, వ్యాపారులు ఉన్న ఖమ్మం నగరంలో ప్లాస్టిక్‌ను తరిమి కొట్టటం పెద్ద సమస్య కాదన్నారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ పాలకవర్గం తమవంతు బాధ్యతగా సహకరించాలని కోరారు. డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, ఏఎంసీ అనిల్ మాట్లాడుతూ పర్యావరణ హితమైన కవర్ల వినియోగంపై అవగాహన కల్పించారు. చాంబర్‌ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కురువెళ్ల ప్రవీణ్‌కుమార్, కార్యదర్శి జీవై నరేశ్, ఉపాధ్యాక్షులు బత్తిలినర్సింహారావు,గాంధీచౌక్ ప్రముఖ వ్యాపారులు, కార్పొరేటర్ కమర్తపు మురళి, పారిశుద్య పర్యవేక్షకులు సాంబయ్య పాల్గొన్నారు.

రేపటి వరకు తనిష్క్ డైమండ్ జ్యూవెలరీ ప్రదర్శన



జ్యోతిప్రజ్వలన చేస్తున్న వీవీసీ సంస్థల చైర్మన్ వంకాయలపాటి ద్రౌపతి, రాజేంద్రప్రసాద్

ఖమ్మంఖానాపురంహవేలి, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): తనిష్క్ ఖమ్మం విహారిక జ్యువల్స్ తరఫున డైమండ్ జ్యువెల్రీ ప్రదర్శన శుక్రవారం వైరారోడ్‌లో హోటల్‌గ్రాండ్ గాయత్రీలో ప్రారంభించారు. అధినేత రాజేంద్ర ప్రసాద్,వీవీసీ సంస్థల చైర్మన్ వంకాయలపాటి ద్రౌపతి, హార్వెస్టవిద్యాసంస్థల ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి,పలువురు వినియోగదారుల సమక్షంలో జ్యోతీప్రజ్వల చేశారు. ఈ సందర్భంగా వంకాయలపాటి వెంకట రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ తనిష్క్ వారు మొట్టమొదటసారిగా ఖమ్మం ప్రీమియం కస్టమర్‌ల కోసం ఈఎగ్జిబిషన్‌ను సుమారు రూ.50 కోట్ల విలువైన సరికొత్త మోడల్స్‌తో ఏర్పాటు చేసాము అన్నారు. ఆదివారం వరకు ఈప్రత్యేక ప్రదర్శన జరుగనుందని, మేకింగ్ చార్జీలపై, డైమండ్ విలువపై అత్యధికంగా 20 శాతం వరకు ఆఫర్ అందుబాటులో ఉందన్నారు.

మేమింతే.. కదలమంతే!

- వీధివ్యాపారులతో అధికారులు 4గంటల చర్చలు
- దుకాణాలు మార్పునకు అంగీకరించని వ్యాపారులు



వాగ్వాదం చేస్తున్న వ్యాపారులు

ఖమ్మంకార్పొరేషన్,డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం వీధివ్యాపారుల కూరగాయల మార్కెట్‌లో దుకాణాల మార్పుకు అంగీకరించేది లేదంటూ భీష్మించారు. నాలుగుగంటలపాటు మెప్మా, కేఎంసీ అధికారులు వీధివ్యాపారులతో చర్చలు జరిపినా ఏ కండిషన్‌కు వ్యాపారులు అంగీకరించ లేదు. చావానైనా చస్తాం అంటూ ఏకంగా అధికారులను బెదిరించారు. వీధివ్యాపారుల కూరగాయల మార్కెట్‌లో పారదర్శకత, ప్రక్షాళన కోసం రెండు నెలలుగా మార్పులు చేర్పులు చేపట్టారు. గతవారం భక్తరామదాసు కళాక్షేత్రంలో లాటరీ ద్వారా కూరగాయల దుకాణాలు మార్పులు చేశారు. వాటిని అమలు చేసేందుకు శుక్రవారం మెప్మా టీఎంసీ గుడిపూడి సుజాతరాని, డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, ఏఎంసీ అనిల్, మార్కెటింగ్ ఈవో శివరామకృష్ణ సిబ్బందితో కలిసి వ్యాపారుల ప్రాంగణంలో నేరుగా వ్యాపారులతో సమావేశం నిర్వహించారు.మార్కెట్‌లోని అందరూ వ్యాపారులకు న్యాయం జరగాలని ప్రతీ 11 నెలలకోసారి డ్రా తీసి దుకాణాలు మార్పులు చేస్తామని వ్యాపారులు సహకరించాలని కోరారు. అందుకు వ్యాపారులు ససేమిరా అన్నారు. 4గంటల పాటు అధికారులతో వాగ్వాదం చేశారు. ఎట్టి పరిస్థితిలో తమ దుకాణాలు పక్కకు కూడా మార్చబోమని తిరిగి అధికారులపైనే గొడవ దిగారు. దీంతో అధికారులు వెనుదిరిగారు.మహాత్మాగాంధీ పెడరేషన్ అధ్యక్షురాలు జ్యోతి, కమ్యూనిటీ ఆర్గనైజర్లు ఎస్‌కే సల్మా, జీ.ఉపేంద్ర, చిలకా ద్రౌపది, ఆర్పీ సునీత, అజయ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు ఆలస్యంగా వస్తే సహించం

నేలకొండపల్లి,డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): చదువుకున్న పాఠశాల మిమ్మల్ని గుర్తుంచుకునేలా ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి పెసర ప్రభాకర రెడ్డి హితవు పలికారు. శుక్రవారం మండలంలోని వివిధ పాఠశాలలను మండల విద్యాధికారితో కలిసి డీఏఎంఓ ప్రభాకర్‌రెడ్డి తనిఖీ చేసారు. తొలుత ముజ్జుగూడెం ఎంపీపీఎస్‌ను తనిఖీ చేశారు. పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులకు గాను ఒక్కరే ఉండటంతో రెండవ ఉపాధ్యాయుడు ఎక్కడని ప్రశ్నించారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా విధులకు హాజరు గాక పోవటంపై ఆరా తీశారు. వివరణ ఇవ్వాలని ఆదేశించారు. దీనిపై చర్యలు తప్పవని ప్రభాకరరెడ్డి హెచ్చరించారు.

ముగిసిన నామినేషన్ల ఘట్టం

(5వ పేజీ తరువాయి)

వేయించడంతో అవి కూడా ఏకగ్రీవమయ్యాయి. అయితే అధికారులు ఈ పంచాయితీ ఎన్నికను అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ఈ గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎస్సీ జనరల్ రిజర్వ్ చేశారు.

ఎస్టీ అభ్యర్థుల్లేని నూకాలంపాడు..

ఏన్కూరు మండలం నూకాలంపాడు పంచాయతీ సర్పంచ్ అభ్యర్థికి ఎస్టీ అభ్యర్థులు ఎవరూ లేకపోవడంతో అక్కడ ఎవరు నామినేషన్ వేయలేదు. మరో నాలుగు వార్డులకు కూడా ఇదే పరిస్థితి. ఎస్టీ అభ్యర్థులేక నామినేషన్లువేయకపోవడంతో కేవలం నాలుగు వార్డులకు మాత్రమే నామినేషన్లు దాఖలయ్యాయి.

కారేపల్లి మండలంలో నాలుగు పంచాయతీలు

కారేపల్లి మండలంలో నాలుగు పంచాయతీలకు ఒక్కో నామినేషన్ పడింది. మూడు పంచాయతీలు కాంగ్రెస్ అభ్యర్థులకు దక్కుతుండగా ఒక్కటి సీపీఐఎంఎల్ మాస్‌లైన్‌కు దక్కనుంది. కొత్తకమలాపురం వడ్డె సులోచన, గిద్దెవారిగూడెంకు ఈసాల వెంకటేశ్వర్లు, కొత్తతండా ధరావత్ మంగిలాల్ ఏకగ్రీవం కాగా మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య స్వగ్రామం టేకులగూడెం గుమ్మడి సందీప్ ఒక్కరే నామినేషన్ వేశారు. కారేపల్లి మాజీఎంపీపీ మాలోతు శకుంతల ఇప్పుడు చీమలపాడు సర్పంచ్‌గా బరిలో దిగారు. తల్లాడ మండలంలో రెండు పంచాయతీలు ఏకగ్రీవంకాగా బిల్లుపాడులో కాంగ్రెస్ మద్దతిస్తున్న ఎనిక కృష్ణవేణి, బస్వాపురంలో స్వతంత్ర పాశం హైమావతి ఏకగ్రీవంగా కానున్నారు. వేంసూరు మండలంలో రెండు పంచాయతీలు కాంగ్రెస్‌కుఏకగ్రీవంగా దక్కాయి. ఎర్రగుంటపాడు చిలక వసంతం, వైఎస్ బంజరకు కనుమతిరెడ్డి రంగారెడ్డి నామినేషన్ వేశారు. గంగులనాచారంలో మల్కం లక్ష్మి అనే కాంగ్రెస్ మద్దతుదారు ఒక్కరే నామినేషన్ వేశారు. ఇది కూడా ఏకగ్రీవం కానుంది. పెనుబల్లి మండలం గంగదేవిపాడులో మాలోత్ రాధాకృష్ణ ఒక్కరే నామినేషన్ వేయడంతో కాంగ్రెస్ నుంచి ఎకగ్రీవం కానున్నారు. కాగా పెనుబల్లి పంచాయతీలో తల్లీకూతురు ఎన్నికల బరిలో నిలిచారు. పెనుబల్లిలో కాంగ్రెస్‌తరుపున భూక్యా సామ్రాజ్యం, బీఆర్ఎస్ తరుపున బానోత్ పాప పోటీలో ఉన్నారు.

కందాళ పర్యటన



భిక్షం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కందాళ

ఖమ్మంరూరల్,డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మంగళగూడెం, తీర్థాల తదితర గ్రామాల్లో పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి శుక్రవారం పర్యటించారు.ఆయా గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన పలు కుటుంబాలను పరామర్శించారు. మంగళగూడెంలోని బొడ్డు బిక్షం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్, మాజీ జడ్పీటీసీ యండపల్లి వరప్రసాద్, రవి, ఉపేందర్ పాల్గొన్నారు.

రెండో విడత ర్యాండమైజేషన్ పూర్తి

(5వ పేజీ తరువాయి)



మాట్లాడుతున్న కాళీచరణ్ ఖర్తాడే

650ఓటర్ల వరకుఉన్న పోలింగ్ కేంద్రాలకు1 పీఓ,ముగ్గురు ఓపీవోలతో బృందాలు ఏర్పాటు చేసి రాష్ట్ర ఎలక్షన్ కమీషన్ కంప్యూటర్ సాఫ్ట్ వేర్ ద్వారా ర్యాండమైజేషన్ చేసామన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వినియోగించుకునేందుకు 20శాతం సిబ్బందిని రిజర్వ్ లో ఉంచామన్నారు. మొదటివిడతకు మొత్తం 1582 బృందాలను సిద్ధం చేసినట్లు వివరించారు..

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

మాట్లాడుతూ ఎన్నికల కమీషన్ నిబంధనల ప్రకారం పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియ విజయవంతంగా నిర్వహించామన్నారు. మొదటి విడత ఎన్నికలు జరగనున్న 192 గ్రామ పంచాయతీలకు, 1740 వార్డులకు 20 శాతం సిబ్బంది రిజర్వ్ కలిపి 1899 పోలింగ్ అధికారులు, 2321 ఓపీఓలను నియమించామన్నారు. 235 పోలింగ్ కేంద్రాలలో ఉన్న 1740 పోలింగ్ స్టేషన్ లలో మొదటి విడత పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని అన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు సిబ్బంది సకాలంలో హాజరయ్యే విధంగా చూడాలని ఆదేశించారు.ఈర్యాండమైజేషన్ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారిణి ఆశాలత, జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి టి. సునీల్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి చైతన్య జైని, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కరాటేలో 'న్యూఇరా' విద్యార్థుల ప్రతిభ

ఖమ్మంస్పోర్ట్స్, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి):ఈనెల3న న్యూఇరా పాఠశాల ఆవరణలో జరిగిన కరాటే బెల్టు గ్రేడ్ టెస్టు పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపి పలు రకాల బెల్టులు సాధించారని పాఠశాల ఛైర్మన్ ఐవి. రమణారావు, డైరెక్టర్ భూమేశ్వరరావు తెలిపారు. పోటీలలో 40మంది పాల్గొనగా17 మందికి ఎల్లోబెల్టులు, 16 మందికి ఆరంజ్ బెల్టులు, నలుగురు గ్రీన్‌బెల్ట్, ఒకరికి బ్లూ, ఇద్దరు బ్రౌన్ బెల్టులు సాధించనట్లు తెలిపారు.



పోలింగ్ సిబ్బంది రెండో విడత ర్యాండమైజేషన్ పూర్తి

(5వ పేజీ తరువాయి)

650 ఓటర్ల వరకు ఉన్న పోలింగ్ కేంద్రాలకు 1 పీఓ, ముగ్గురు ఓపీవోలతో బృందాలు ఏర్పాటు చేసి రాష్ట్ర ఎలక్షన్ కమీషన్ కంప్యూటర్ సాఫ్ట్ వేర్ ద్వారా ర్యాండమైజేషన్ చేసామన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వినియోగించుకునేందుకు 20 శాతం సిబ్బందిని రిజర్వ్ లో ఉంచామన్నారు. మొదటి విడతకు మొత్తం 1582 బృందాలను సిద్ధం చేసినట్లు వివరించారు..

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఎన్నికల కమీషన్ నిబంధనల ప్రకారం పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియ విజయవంతంగా నిర్వహించామన్నారు. మొదటి విడత ఎన్నికలు జరగనున్న 192 గ్రామ పంచాయతీలకు, 1740 వార్డులకు 20 శాతం సిబ్బంది రిజర్వ్ కలిపి 1899 పోలింగ్ అధికారులు, 2321 ఓపీఓలను నియమించామన్నారు. 235 పోలింగ్ కేంద్రాలలో ఉన్న 1740 పోలింగ్‌స్టేషన్ లలో మొదటి విడత పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని అన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు సిబ్బంది సకాలంలో హాజరయ్యే విధంగా చూడాలని ఆదేశించారు. ఈ ర్యాండమైజేషన్ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారిణి ఆశాలత, జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి టి. సునీల్ రెడ్డి, జిల్లా విద్యా శాఖ అధికారిణి చైతన్య జైని, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసిన డీడీ



విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్న డీడీ

ఏన్కూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూలపోచారం ఆశ్రమ పాఠశాలను జిల్లా గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్(డీడీ) ఎన్.విజయలక్ష్మి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. మధ్యాహ్న భోజన సమయంలో ఆమె పాఠశాలను సందర్శించారు. ఈసందర్భంగా మధ్యాహ్న భోజన మెను అమలు ఎలా ఉందో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల పరిసరాలను, స్టోర్‌రూంలో నిల్వచేసిన నిత్యావసర సరుకులను స్టాక్ రికార్డులను పరిశీలించారు. పీవో రాహుల్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉద్దీపకము అమలు తీరుతెన్నులను అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమలో పాఠశాల హెచ్ఎం జి.నాగరాజు, డిప్యూటీ వార్డెన్ బి.రవి, సీనియర్ ఉపాధ్యాయులు డీఎస్‌నాగేశ్వరావు, ఉపాధ్యాయులు బి.శోభన్, బి.రవి,కె.శ్యామల, వి. రమేష్, ఏ .సుస్మిత, ఎం..చంద్రరావు, జె.నాగేశ్వరరావు, పి.శ్రీనివాసరావు, డి.ఉషశ్రీ, టి.సూర్యానాయక్, ఏఎన్ఎం సౌందర్య తదితరులు పాల్గొన్నారు.

సొంతపార్టీకి వెన్నుపోటు

- రెబల్ అభ్యర్థులపై చర్యలు తప్పవు
- మండల కాంగ్రెస్ నాయకుల ఆరోపణ



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

సత్తుపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయితీ ఎన్నికలలో అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుని కాంగ్రెస్ బలపరుస్తున్న అభ్యర్థులను సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్‌లు ప్రకటించగా కొందరు పార్టీకి నష్టం కలిగించే రీతిలో వ్యవహరిస్తున్నారని సత్తుపల్లి, పెనుబల్లి, వేంసూరు మండలాల కాంగ్రెస్ నాయకులు ధ్వజమెత్తారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ మద్దతు ప్రకటించిన అభ్యర్థులకు వ్యతిరేకంగా రెబల్ అభ్యర్థులను పార్టీకి చెందిన రాష్ట్రస్థాయి నాయకుడు ఒకరు పోటీలో నిలిపి పార్టీకి నష్టం చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక రాష్ట్ర పదవి పొంది సత్తుపల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి నాయకత్వాన్ని నిర్వీర్యం చేసే చర్యలకు పాల్పడుతూ రెబల్ అభ్యర్థులను రంగంలోకి దింపారని ఆరోపించారు. పార్టీ ఆదేశాలను పాటించాల్సిన నాయకులు పార్టీకి వ్యతిరేకంగా పనిచేయడం క్షమించరాని నేరమని పేర్కొన్నారు. పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా పోటీ చేస్తున్న అభ్యర్థులపై చర్యలు తప్పవని, వారిని ప్రోత్సహిస్తున్న రాష్ట్ర స్థాయి నాయకుడిపై అధిష్టానానికి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు శివా వేణు, కాసర్ల చంద్రశేఖర్‌రెడ్డి, పంది వెంకటేశ్వరరావు, ఏఎంఏసీ ఛైర్మన్ దోమా ఆనంద్, పట్టణాధ్యక్షుడు గాదె చెన్నకేశవరావు, కాంగ్రెస్ నాయకులు కొత్తూరు ప్రభాకరరావు, చల్లగుళ్ల నరసింహారావు, చీకటి రామారావు, ఎండీ.కమల్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

పంట అవశేషాలను నేలలోనే కలియదున్నాలి



అవశేషాలపై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ

ముదిగొండ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వరి, పత్తి పంటల కోతల అనంతరం మిగిలిన పంట అవశేషాలను కాల్చకుండా నేలలో కలియదున్నాలని మధిర ఏడీఏ విజయచంద్ర రైతులకు సూచించారు. శుక్రవారం ముదిగొండ మండలం బాణాపురం గ్రామంలో పంట అవశేషాలను నేలలో కలియదున్నడం ద్వారా కలిగే ప్రయోజనాల గురించి క్షేత్రస్థాయిలో రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంట అవశేషాలను కాల్చడం ద్వారా అనేక అనర్థాలు జరుగుతున్నాయని, పంటలకు మేలు చేసే క్రిమికీటకాలు నశించడమే కాకుండా భూసారం తగ్గిపోతుందన్నారు. దుక్కిదున్నే సమయంలో సూపర్ ఫాస్పేట్ చల్లితే అవశేషాలు రెండు వారాల్లో మురిగి పోషకాలుగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఫలితంగా డీఏపీ వాడకం సగం వరకు తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో ఏఈవో షేక్. నాగూల్‌మీరా, రైతులు గుండు రామారావు, లక్ష్మీకాంత, మొక్కా నర్సింహారావు, కాసయ్య, వీరబాబు పాల్గొన్నారు.

పల్లెల్లో వేడెక్కిన పంచాయతీ పోరు

- మధిర మండలంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య హోరాహోరీ

మధిర రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మధిర మండలంలో గ్రామపంచాయతీ ఎన్నికల వాతావరణం వేడెక్కింది. ఎన్నిలకు మరో ఐదురోజుల సమయం మాత్రమే ఉండడంతో పోటీలో ఉన్న పలు ప్రధాన పార్టీల అభ్యర్థులు గెలుపు కోసం వ్యూహ ప్రతివ్యూహాలు రచిస్తూ ప్రత్యర్థుల ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ ముందుకుపోతున్నారు. మండలంలో మొత్తం 27పంచాయతీలు ఉండగా సిద్దినేనిగూడెం(మర్లపాడు), సైదిల్లీపురం గ్రామపంచాయతీలు మాత్రమే ఏకగ్రీవం కాగా ఈ రెండు పంచాయతీల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన అభ్యర్థులు ఏకగ్రీవమయ్యారు. మిగిలిన 25 గ్రామపంచాయతీల్లో తీవ్రమైన పోటీ నెలకొంది. ముఖ్యంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య పలు గ్రామాల్లో హోరాహోరీ పోరు కొనసాగుతుంది.


మండలంలోని సిరిపురం, జాలిముడి, రొంపిమళ్ల, రామచంద్రాపురం, కృష్ణాపురం, వంగవీడు, నక్కలగరుబు, ఆత్కూరు, మాటూరు, దెందుకూరు, తొండలగోపవరం, చిలుకూరు, రాయపట్నం, మహదేవపురం, ఇల్లూరు గ్రామపంచాయతీల్లో హోరాహోరీ పోరు ఈ రెండు పార్టీల మధ్య సాగుతోంది. ఆయా గ్రామల్లో పోటీలో ఉన్న సర్పంచ్ అభ్యర్థులు 'నువ్వా నేనా' అనే స్థాయిలో తలపడుతున్నారు. అయితే దెందుకూరు, సిరిపురం గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీకి రెబల్ అభ్యర్థులు కూడా గట్టీ పోటీ ఇస్తున్నారు. రెబల్స్‌తో నష్టం జరుగుతుందేమోననే ఆందోళనలో కాంగ్రెస్ పార్టీ ఉంది. కొన్ని పంచాయతీల్లో ఎవరు గెలిచినా అతిస్వల్ప మెజార్టీతో గట్టేక్కే అవకాశాలు ఉన్నట్లు స్పష్టంగా కన్పిస్తోంది. ఇరు పార్టీలకు చెందిన ప్రధాన నాయకులు ఎక్కడ తగ్గొద్దు అనే స్థాయిలో కార్యకర్తలను ఎంకరేజ్ చేస్తూ గ్రామాల్లో విస్తృతంగా ఇంటింటా తిరుగుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు. 14గ్రామపంచాయతీల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య హోరాహోరీగా పోరు సాగుతుండడంతో రెండు పార్టీలు ఈ ఎన్నికను సవాల్‌గా తీసుకున్నాయి. మధిర మండలంలో బీఆర్ఎస్, సీపీఎం కలిసి పోటీ చేస్తుండగా కాంగ్రెస్, సీపీఐ కలిసి పోటీ చేస్తున్నాయి. బీఆర్ఎస్ పొత్తుల్లో భాగంగా మండలంలోని మల్లారం, ఖమ్మంపాడు గ్రామాల్లో సీపీఎం పోటీ చేస్తోంది. అలాగే మల్లారం గ్రామపంచాయతీని కాంగ్రెస్ పార్టీ సీపీఐకి వదిలేసి మద్దతు పలికింది. తెలుగుదేశం మండలంలోని అల్లీనగరం, దెందుకూరు, రాయపట్నం గ్రామాల్లో పోటీలో ఉంది. మెజార్టీ గ్రామపంచాయతీలను దక్కించుకుని తమ సత్తా చాటాలని కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఈ ఎన్నికల్లో పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నాయి. మొత్తం మీద స్థానిక ఎన్నికల నేపథ్యంలో మధిర మండలంలోని పల్లెల్లో పంచాయతీ పోరు ఒక యుద్ధ వాతావరణాన్ని తలపిస్తోంది.



దెందుకూరు గ్రామపంచాయతీ కార్యాలయం

రద్దుచేసిన ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించండి

- కేంద్రమంత్రికి ఎంపీ వద్దిరాజు వినతిపత్రం



కారేపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కారేపల్లి రైల్వేస్టేషన్ గుండ పలు ప్రాంతాలకు ప్రయాణించే అనేక రైళ్లను రైల్వేశాఖ రద్దుచేసింది. ఆ రైళ్లను మళ్లీ పునరుద్దరించాలని కేంద్ర రైల్వే మంత్రి అశ్వని వైష్ణవ్‌కు రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఢిల్లీలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. భద్రాచలం రోడ్డు-డోర్నకల్ మధ్యలో వయా కారేపల్లి ద్వారా నడిచే పలు రైళ్లను కోవిడ్ సమయంలో రద్దు చేయడం జరిగింది. ఆ రైళ్ళను నేటికి పునరుద్దరించకపోవడంతో మండల కేంద్రానికి చెందిన సామాజిక కార్యకర్త ఇందుర్తి సురేందర్‌రెడ్డి ఇటీవల రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు దృష్టికి తీసుకవెళ్ళారు. దీంతో ఈ సమస్యను ఎంపీ రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళ్ళారు. డోర్నకల్, భద్రాచలం, కాజీపేట, మణుగురు, కొల్లపూర్ ప్యాసింజర్‌రైళ్లను పునరుద్దరించాలని, కాకతీయ ప్యాసింజర్ రైలును తడికలపుడి, చీమలపాడు, బేతంపుడి స్టేషన్‌లలో హాల్టింగ్ సదుపాయం కల్పించాలని ఎంపీ కోరారు.

జాతీయస్థాయి టేబుల్ టెన్నిస్‌కు సిరి



బోనకల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జానకీపురం గ్రామానికి చెందిన గద్దల సిరి జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ టేబుల్ టెన్నీస్ పోటీలకు ఎంపికైంది. ఈనెల 25వతేదీ నుంచి చెన్నైలో జరుగనున్న జాతీయస్థాయి స్కూల్ గేమ్స్‌లో సిరి ఆడనుంది. ఖమ్మంలో ఇంటర్మీడియేట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న సిరి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల జిల్లా క్రీడా యువజన అధికారి సునీల్‌కుమార్‌రెడ్డి, జిల్లా టేబుల్ టెన్నీస్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలసాని విజయ్‌కుమార్, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి రామారావు, అడ్వజర్ సైదులు హర్షం వ్యక్తం చేశారు.

బీజేపీ బలపరిచిన అభ్యర్థుల విజయం తథ్యం: నంబూరి



నామినేషన్ వేస్తున్న దేశిరెడ్డి సత్యవతి

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయితీ ఎన్నికలలో బీజేపీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులు, వార్డు మెంబర్ల విజయం తథ్యమని ఆపార్టీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు అన్నారు. సత్తుపల్లి మండలంలో 5సర్పంచ్, 12వార్డులు, కల్లూరులో 5సర్పంచ్, వేంసూరులో 3సర్పంచ్, పెనుబల్లిలో 3సర్పంచ్ స్థానాలలో బీజేపీ అభ్యర్థులు పోటీ చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో భాస్కర్ల వీరంరాజు, మున్నా మిశ్రా, గొర్ల ప్రభాకర్‌రెడ్డి, సాలి శివకృష్ణ, నాగులు తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవం దిశగా రెండు పంచాయతీలు

- బస్వాపురంలో హైమావతి, బిల్లుపాడులో కృష్ణవేణి





తల్లాడ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలంలో రెండు గ్రామపంచాయతీలు ఏకగ్రీవం కానున్నాయి. శుక్రవారం తల్లాడ మండలం గ్రామపంచాయతికి నామినేషణ్ల స్వీకరణ ఘట్టం ముగిసింది. దీంతో తల్లాడ మండలంలోని బస్వాపురం గ్రామ పంచాయతీలో కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఎం పార్టీల నాయకుల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం సర్పంచ్ పదవికి పాశం హైమావతి ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. మండలంలోని బిల్లపాడు గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవికి కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎనికే కృష్ణవేణి ఒక్కరే నామినేషన్ వేశారు. బిల్లుపాడు పంచాయతీలో మొత్తం పదివార్డులకు కూడా ఒక్కో నామినేషణ్ దాఖలయ్యాయి. బస్వాపురంగ్రామ పంచాయతీలో నిమిది వార్డులకు గాను ఐదో వార్డు మినహా మిగిలిన ఏడు వార్డులకు ఒక్కో నామినేషన్ చొప్పన దాఖలయ్యాయి. దీంతో బిల్లుపాడులో పదివార్డులకు, బసావపురంలో ఏడువార్డులు ఏకగ్రీవం కానున్నాయి. బిల్లుపాడులో కాంగ్రెస్ మండల నాయకుడు జక్కంపుండి కిషోర్ ప్రత్యేక చొరవ తీసుకుని స్థానిక కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులతో చర్చించి ఏకగ్రీవం చేసేందుకు కృషిచేశారు. బిల్లుపాడులో సర్పంచ్ ఏకగ్రీవానికి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్యం ఒప్పందం కుదిరింది. పది వార్డుల్లో ఐదువార్డులు కాంగ్రెస్, మరో ఐదువార్డులతపాటు ఉపసర్పంచ్ పదవిని బీఆర్ఎస్‌కు కేటాయిచేందుకు పార్టీ నాయకులు అంగీకారం తెలిపారు.

బీహెచ్‌ఈఎల్‌కు అదనంగా 4ఏసీ సర్వీసులు

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజూ సత్తుపల్లి నుంచి హైదరాబాద్‌లోని బీహెచ్‌ఈఎల్‌కు అదనంగా 2రాజదాని ఏసీ సర్వీసులను నడిపిస్తున్నట్లు సత్తుపల్లి ఆర్టీసీ డీఎం ఊటుకూరి సునీత తెలిపారు. గతంలో ఉదయం, రాత్రి వేళల్లో ఒకటి చొప్పున ఏసీ సర్వీసులు నడుస్తుండగా ఇకనుంచి ఉదయం 7.45, 9, 10, రాత్రి 9, 9.45, 10.30లకు బయల్దేరి వెళతాయన్నారు.

కాంగ్రెస్, టీడీపీ చెట్టాపట్టాల్



కాంగ్రెస్ నామినేషన్‌లో టీడీపీ నాయకులు

సత్తుపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పార్టీ రహితంగా జరుగుతున్న గ్రామ పంచాయితీ ఎన్నికలలో స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పార్టీలకు అతీతంగా ఒక్కటవుతున్నారు. ఏ నిమిషంలో ఎవరు ఎవరితో జట్టుకడతారో అంతుపట్టకుండా ఉంది. రాజకీయాలలో శాశ్విత శత్రువులు, శాశ్విత మిత్రులు ఉండరనే నానుడికి నిదర్శనంగా శుక్రవారం సత్తుపల్లి మండలం కాకర్లపల్లిలో తెలుగు దేశం అభిమానులు, కాంగ్రెస్ శ్రేణులు ఒక్కటయ్యారు. సర్పంచ్ అభ్యర్థిగా కాంగ్రెస్ బలపరిచిన నాయకుడికి మద్దతుగా స్థానిక తెలుగుదేశం నాయకులు కదలివచ్చారు. ఈ సందర్భంగా జరిగిన ప్రదర్శనలో కాంగ్రెస్, తెలుగు దేశం జెండాలు రెపరెపలాడాయి.

ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కు సాగి సుజాత



ఏన్కూరు, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): మండలంలోని బురదరాఘవాపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న సాగి సుజాతకు ఇంటర్నేషనల్ సైన్సు ఫెస్టివల్ డెలిగేట్స్ సదస్సులో పాల్గొనే అరుదైన అవకాశం లభించింది. ఐఐఎస్ఎఫ్ 2025 సైన్స్ సఫారీ విభాగంలో ఖమ్మం జిల్లా నుంచి ఆమె ఒక్కరే ఎంపిక కావడం విశేషం. ఐఐఎస్ఎఫ్ వికసిత్ భారత్ 2047లో భారతదేశం సాంకేతిక అభివృద్ధిలో ఎలా ఉండబోతుందనే అంశంపై అత్యుత్తమ ప్రదర్శనకు గాను డెలిగేట్స్‌గా ఆహ్వానించారు. ఈనెల 6నుంచి 9వతేదీ వరకు చండీగఢ్‌లో జరిగే ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌లో ప్రతినిధులుగా ఆమె పాల్గొననున్నారు. ఈసదస్సులో విద్యాబోధనలో మెలకువలపై వర్కుషాప్ నిర్వహిస్తారు. భారతదేశం నుంచి 200మంది ప్రతినిధులు పాల్గొననున్నారు.

భూసార పరీక్షలతో బహుళ ప్రయోజనాలు

వైరా, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రైతులు భూసార పరీక్షలు చేయించుకోవడం ద్వారా ఎన్నో ప్రయోజనాలు లభిస్తాయని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ధనసరి పుల్లయ్య తెలిపారు. మండలంలోని సోమవరంలో శుక్రవారం మృతిక దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ప్రతి ఒక్క రైతు విధిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి ధనసరి పుల్లయ్య, జిల్లా సాంకేతిక సంస్థ పీడీ భూక్యా సరిత, వైరా ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ, కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ సుచరితాదేవి, ఏవో మయాన్ మంజూఖాన్ పాల్గొన్నారు.

మందా మృతి పట్ల పలువురి సంతాపం



మృతదేహానికి నివాళులర్పిస్తున్న వెంకటేశ్వర్లు

చింతకాని, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లచ్చగూడెం గ్రామానికి చెందిన టీడీపీ సానుభూతిపరురాలు మందా ముత్యాలు(103) మృతి పట్ల పలువురు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట నాయకుడు కూరపాటి వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ నాయకులు గురిజాల హన్మంతరావు, తాతా ప్రసాద్‌రావు ఆమె మృతదేహాన్ని సందర్శించి సంతాపాన్ని ప్రకటించి ఆమె కుంటుంబ సభ్యులను ఓదార్చారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ సాంబరాజు

బోనకల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అందరూ సహకరించాలని సీసీబీ ఏసీపీ యు.సాంబరాజు కోరారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం అభ్యర్థులు, రాజకీయ పార్టీల నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల నిబంధనల మేరకు ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని సూచించారు. అల్లర్లు సృష్టిస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు అందరూ సమన్వయంతో ముందుకు సాగాలని కోరారు. ఎస్ఐ పొదిలి వెంకన్న పాల్గొన్నారు.

వైరా: గ్రామాల్లో ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించుకోవాలని, ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని వైరా ఎస్ఐ పుష్పాల రామారావు సూచించారు. వైరా రెండో ఎస్ఐ వెంపటి పవన్‌తో కలిసి శుక్రవారం మండలంలోని తాటిపూడి పంచాయతీ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులు, పోటీలో ఉన్న అభ్యర్థులతో సమావేశాన్ని నిర్వహించారు. ఎస్ఐ రామారావు మాట్లాడుతూ.. మద్యం, డబ్బు పంపిణీ చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెట్టొద్దని సూచించారు.

అభివృద్ధి చేస్తా.. ఆదరించండి

- కొణిజర్ల కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి గూదె పుష్పావతి

కొణిజర్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మాజీ సర్పంచ్, కాంగ్రెస్ జిల్లా నాయకులు సూరంపల్లి రామారావు ఆశీస్సులతో కొణిజర్లగ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రజల ముందుకు వస్తున్న, ఆదరించండి అంటూ కొణిజర్ల గ్రామ పంచాయతీ కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి గూదె పుష్పావతి గ్రామప్రజలను కోరారు. శుక్రవారం ఆ గ్రామంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. గ్రామాభివృద్ధిలో సూరంపల్లిని ఆదర్శంగా తీసుకుని ప్రజలకు తన వంతు సేవ చేయాలనే తపనతో విద్యావంతురాలుగా పోటీ చేస్తున్నానని తనపై నమ్మకంతో ఓటు వేసి గెలిపించాలని కోరారు. గ్రామంలోని ప్రతి సమస్యను ఏజెండాగా పెట్టుకొని పరిష్కారం చేస్తానని, ఒక్కసారి అవకాశం ఇవ్వాలని ఆమె ప్రజలను కోరారు. వాడ వాడల తిరుగుతున్న ఆమెకు ప్రజల నుంచి కూడా స్పందన లభించింది. ఈ ప్రచారంలో గ్రామస్తులతో పాటు సూరంపల్లి రామారావు, సీపీఐ జిల్లా నాయకులు దొండపాటి రమేష్, కాంగ్రెస్, సీపీఐ నాయకులు, కార్యకర్తలు, అభ్యర్థిని భర్త గూదె ఉపేందర్ పాల్గొన్నారు.



కొణిజర్లలో ప్రచారం చేస్తున్న గూదె పుష్పావతి

ముగిసిన నామినేషన్ల ఘట్టం

(5వ పేజీ తరువాయి)

వేయించడంతో అవి కూడా ఏకగ్రీవమయ్యాయి. అయితే అధికారులు ఈ పంచాయితీ ఎన్నికను అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ఈ గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎస్సీ జనరల్ రిజర్వ్ చేశారు.

ఎస్టీ అభ్యర్థుల్లేని నూకాలంపాడు..

ఏన్కూరు మండలం నూకాలంపాడు పంచాయతీ సర్పంచ్ అభ్యర్థికి ఎస్టీ అభ్యర్థులు ఎవరూ లేకపోవడంతో అక్కడ ఎవరు నామినేషన్ వేయలేదు. మరో నాలుగు వార్డులకు కూడా ఇదే పరిస్థితి. ఎస్టీ అభ్యర్థులేక నామినేషన్లు వేయకపోవడంతో నాలుగు వార్డులకు మాత్రమే నామినేషన్లు దాఖలయ్యాయి.

కారేపల్లి మండలంలో నాలుగు పంచాయతీలు..

కారేపల్లి మండలంలో నాలుగు పంచాయతీలకు ఒక్కో నామినేషన్ పడింది. మూడు పంచాయతీలు కాంగ్రెస్ అభ్యర్థులకు దక్కుతుండగా ఒక్కటి సీపీఐఎంఎల్ మాస్‌లైన్‌కు దక్కనుంది. కొత్తకమలాపురం వడ్డె సులోచన, గిద్దెవారిగూడెంకు ఈసాల వెంకటేశ్వర్లు, కొత్తతండా ధరావత్ మంగిలాల్ ఏకగ్రీవం కాగా మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య స్వగ్రామం టేకులగూడెం గుమ్మడి సందీప్ ఒక్కరే నామినేషన్ వేశారు. కారేపల్లి మాజీ ఎంపీపీ మాలోతు శకుంతల ఇప్పుడు చీమలపాడు సర్పంచ్‌గా బరిలో దిగారు. తల్లాడ మండలంలో రెండు పంచాయతీలు ఏకగ్రీవంకాగా బిల్లుపాడులో కాంగ్రెస్ మద్దతిస్తున్న ఎనిక కృష్ణవేణి, బస్వాపురంలో స్వతంత్ర పాశం హైమావతి ఏకగ్రీవంగా కానున్నారు. వేంసూరు మండలంలో రెండు పంచాయతీలు కాంగ్రెస్‌కుఏకగ్రీవంగా దక్కాయి. ఎర్రగుంటపాడు చిలక వసంతం, వైఎస్ బంజరకు కనుమతిరెడ్డి రంగారెడ్డి నామినేషన్ వేశారు. గంగులనాచారంలో మల్కం లక్ష్మి అనే కాంగ్రెస్ మద్దతుదారు ఒక్కరే నామినేషన్ వేశారు. ఇది కూడా ఏకగ్రీవం కానుంది. పెనుబల్లి మండలం గంగదేవిపాడులో మాలోత్ రాధాకృష్ణ ఒక్కరే నామినేషన్ వేయడంతో కాంగ్రెస్ నుంచి ఎకగ్రీవం కానున్నారు. కాగా పెనుబల్లి పంచాయతీలో తల్లీకూతురు ఎన్నికల బరిలో నిలిచారు. పెనుబల్లిలో కాంగ్రెస్ తరుపున భూక్యా సామ్రాజ్యం, బీఆర్ఎస్ తరుపున బానోత్ పాప పోటీలో ఉన్నారు.